


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575



www.rajamudranews.com
అక్షర రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | సోమవారం | 27.04.2026 | సంపుటి: 3 | సంచిక: 85 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | MONDAY | 27.04.2026 | V0LUME : 3 | ISSUE : 85 | PAGES: 8 | COST: 2/- |



## విలేకరులు కావలెను

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9182 474 575




# తెలంగాణలో చారిత్రక ఘట్టం

- రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి జనగణన
- తొలి విడతలో అందుబాటులోకి వచ్చిన ప్రత్యేక పోర్టల్
- తొలి పౌరుడిగా వివరాలు నమోదు చేసుకున్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- వచ్చే నెల 10 వరకు కొనసాగనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియ
- తెలంగాణలో 80 వేల మంది ఎన్యూమరేటర్లతో భారీ కసరత్తు
- మే 11 నుంచి జూన్ 9 వరకు నివాస గృహాల జాబితా సేకరణ
- ప్రజల సందేహాల నివృత్తి కోసం 1855 నంబర్‌తో ప్రత్యేక హెల్ప్‌లైన్
- 16 భాషల్లో స్వీయగణన వెసులుబాటు.. సమాచార భద్రతపై అధికారుల భరోసా
- జనగణనతో పాటే కులగణన ప్రక్రియ కూడా చేపడుతున్నట్లు వెల్లడి

**హైదరాబాద్, ఏప్రిల్ 26:**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా నిర్వహిస్తున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా 16 ఏళ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ జనగణనలో భాగంగా తొలి దశలో స్వీయగణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన se.census.gov.in పోర్టల్ ఉదయం 6

..మిగతా 2లో






## మలేరియా రహిత భారత్ దిశగా అడుగులు

- 2030 నాటికి మహమ్మారిని తరిమికొట్టాలని సీసీఎంబీ పిలుపు
- హైదరాబాద్ లో ప్రపంచ మలేరియా దినోత్సవ సదస్సు
- నిర్మూలన లక్ష్య సాధనలో అందరి సమన్వయం కీలకం
- మలేరియా పరాన్నజీవుల సంక్లిష్టతతో శాస్త్రవేత్తలకు సవాళ్లు
- పట్టణ ప్రాంతాలకు మారుతున్న వ్యాప్తి.. పెరుగుతున్న కేసులు

**హైదరాబాద్, ఏప్రిల్ 26:**

భారతదేశాన్ని 2030 నాటికి మలేరియా రహిత దేశంగా మార్చడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సీసీఎంబీ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ డాక్టర్ మధుసూదన రావు కోరారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్

..మిగతా 2లో

# ప్రజల ముంగిటకే ప్రజావాణి

- హైదరాబాద్ రానవసరం లేకుండా స్థానికంగా ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణయం
- డివిజన్ కేంద్రాల తర్వాత మండల స్థాయికి ప్రజావాణి సేవలు విస్తరణ
- ప్రతి అర్జీని నమోదు చేసి పరిష్కార పురోగతిని బాధితులకు వివరించాలి
- సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులదే బాధ్యత
- ఫిర్యాదుల ట్రాకింగ్ కోసం అత్యాధునిక ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం ఏర్పాటు
- పైస్థాయి అధికారులకు చేరేలా ఆటో ఎస్కలేషన్, అప్పీల్ వ్యవస్థల రూపకల్పన
- రెవెన్యూ డివిజన్ స్థాయిలో అమలుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



3

# అణు శక్తి రంగంలో భారత్ సరికొత్త చరిత్ర

- కల్పకం రియాక్టర్ విజయంపై ప్రధాని మోదీ ప్రశంసలు
- మన్ కీ బాత్ 133వ ఎపిసోడ్‌లో కీలక వ్యాఖ్యలు
- ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరడం గర్వకారణం
- వికసిత భారత్‌కు ఉత్తేజంగా అణు శాస్త్రవేత్తల కృషి
- 56 గిగావాట్లకు దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం
- జనగణన-2027లో పౌరులందరూ బాధ్యతగా పాల్గొనాలని పిలుపు
- డిజిటల్ పద్ధతిలో సాగనున్న దేశ గణన
- సెల్ఫ్ ఎన్యూమరేషన్ పై ప్రధాని దిశానిర్దేశం



**హైదరాబాద్, ఏప్రిల్ 26:**

భారతదేశ అణు ఇంధన చరిత్రలో కల్పకం ఫాస్ట్ బ్రీడర్ న్యూక్లియర్ రియాక్టర్ క్రిటికాలిటీ దశకు చేరుకోవడం ఒక చారిత్రక ఘట్టమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. ఆదివారం నిర్వహించిన 133వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ, ఈ అసాధారణ విజయం సాధించిన అణు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ రియాక్టర్ ఏప్రిల్ 6 నుంచి

..మిగతా 2లో




# అవసరానికి మించి నీళ్లు ఇవ్వలేం

- నీటి వృథాపై జలమండలి ఆగ్రహం
- తాగునీటిలో 20 శాతం పొదుపు చేయాలని విజ్ఞప్తి
- నగరంలో కోటి 30 లక్షల జనాభా
- సరిపడా నీటి సరఫరా చేస్తున్న బోర్డు
- గోదావరి ఫేజ్ 2, 3 పనులు వచ్చే ఏడాదికి పూర్తి
- సింగూరు డ్యామ్‌లో తగ్గిన నీటి మట్టం
- అత్యవసర పంపింగ్ కోసం ముందస్తు ఏర్పాట్లు
- వృథా అరికట్టకపోతే తీవ్ర నీటి ఎద్దడి
- నగర ప్రజలకు జలమండలి ఎండీ హెచ్చరిక
- రూ.720 కోట్లతో మంజీరా పాత పైపులైన్ల పునరుద్ధరణ
- కొత్త పైపులైన్ల ఏర్పాటుకు టెండర్లు
- ఉస్మాన్ సాగర్ నుంచి అదనంగా 25 ఎంజీడీలు



**హైదరాబాద్, ఏప్రిల్ 26:**

హైదరాబాద్ నగరంలో వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తాగునీటి వినియోగంపై జలమండలి కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో నగర ప్రజలకు అవసరానికి మించి అదనపు నీటిని సరఫరా చేయడం సాధ్యపడదని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి స్పష్టం చేశారు. నగరవ్యాప్తంగా సుమారు 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న 15 లక్షల నీటి కనెక్షన్లకు నిరంతరాయంగా సరఫరా జరుగుతున్నప్పటికీ, ప్రజల నుంచి అదనపు నీటి కోసం డిమాండ్ పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు. కోటి 30 లక్షల జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికే గరిష్ఠ స్థాయిలో నీటిని పంపిణీ చేస్తున్నామని, అయితే ప్రతి ఒక్కరు తాము వాడుకునే నీటిలో కనీసం 20 శాతం పొదుపు చేయాలని విజ్ఞప్తి చేశారు. నీటి వృథా అరికట్టకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. నల్లా నీటిని పది నిమిషాలు అదనంగా ఇస్తే రోడ్లపై పారుతున్నాయని, పది నిమిషాలు తగ్గిస్తే ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన తన వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. ప్రజలు బాధ్యతగా ఉండి ప్రతి నీటి బొట్టును కాపాడుకోవాలని కోరారు.

నగర నీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం దీర్ఘకాలిక ప్రణాళికలతో ముందుకు వెళుతోంది. గోదావరి ఫేజ్ 2 మరియు 3 పనులను వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి

..మిగతా 2లో

## స్వీయగణనలో కిషన్ రెడ్డి

- ప్రజలంతాచురుకుగా పాల్గొనాలని కోరిన కేంద్ర మంత్రి
- జనాభా లెక్కల ప్రాముఖ్యతను వివరించిన కిషన్ రెడ్డి
- వికసిత్ భారత్ సాధనలో జనాభా లెక్కల గణాంకాలు కీలక పాత్ర పోషిస్తాయన్న కేంద్ర మంత్రి



2

## మత్తు పదార్థాలతో ప్రాణహాని తప్పదు

- మాదక ద్రవ్యాల అమ్మకాలపై కఠిన చర్యలు
- యువత ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి
- గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

**హైదరాబాద్, ఏప్రిల్ 26:**

మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ అమ్మకాలపై రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటూ అణచివేస్తోందని రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. యువత ఇలాంటి వ్యసనాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తు దిశగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని రాయదుర్గం సత్త్వ నాలెడ్జ్ పార్క్‌లో గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్

..మిగతా 2లో

# రంగుల సినిమా చూపించి రేవంత్ అధికారంలోకి వచ్చాడు

- రంగుల హామీలతో అధికారంలోకి వచ్చారన్న కేటీఆర్ విమర్శ
- సీఎం రేవంత్‌కు 'ఐడెంటిటీ క్రైసిస్' ఉందని ఎద్దేవా
- ఆరు గ్యారెంటీల అమలుపై ప్రశ్నల వర్షం

**హైదరాబాద్, ఏప్రిల్ 26:**

కాంగ్రెస్ ప్రభుత్వం , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో సాధ్యం కాని హామీలతో ప్రజలకు 'ఈస్ట్‌మన్ కలర్' రంగుల సినిమా చూపించి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చారని ఆయన మండిపడ్డారు. నల్గొండ జిల్లా పర్యటనలో భాగంగా కేటీఆర్ చేసిన ప్రసంగం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రస్తుతం 'ఐడెంటిటీ క్రైసిస్' (గుర్తింపు సమస్య) ఏర్పడిందని



..మిగతా 2లో

# అణు శక్తి రంగంలో భారత్ సరికొత్త చరిత్ర

**మొదటిపేజీ తరువాయి**



పూర్తిస్థాయిలో తన పనిని ప్రారంభించిందని, ఇది ఇంధన రంగంలో భారత్‌ను స్వయంసమృద్ధి వైపు నడిపిస్తుందని పేర్కొన్నారు. గత మార్చిలో తాను వ్యక్తిగతంగా కల్పకం సందర్శించి రియాక్టర్ లోడింగ్ ప్రక్రియను వీక్షించినప్పుడు కలిగిన అనుభూతిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అణు ఇంధన కార్యక్రమాల వల్ల కేవలం విద్యుత్ ఉత్పత్తి మాత్రమే కాకుండా పారిశ్రామిక, ఆరోగ్య మరియు వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయని భరోసా ఇచ్చారు. సైన్స్ మరియు టెక్నాలజీ రంగాల్లో భారత్ సాధిస్తున్న ప్రగతి దేశ నిర్మాణానికి బలమైన పునాది వేస్తోందని, ముఖ్యంగా అంతరిక్ష పరిశోధనల్లో మన శాస్త్రవేత్తల చొరవ అద్భుతమని ప్రధాని ప్రశంసించారు.

దేశాభివృద్ధిలో పర్యావరణ హితమైన విద్యుత్ వనరుల ప్రాధాన్యతను వివరిస్తూ, పవన విద్యుత్ రంగంలో భారత్ సాధించిన ప్రగతిని మోదీ వివరించారు. ప్రస్తుతం దేశ పవన విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 56 గిగావాట్లు దాటడం ఒక విశేషమని, గత ఏడాదిలోనే అదనంగా 6 గిగావాట్ల సామర్థ్యం పెరిగిందని వెల్లడించారు. భవిష్యత్తు అవసరాల కోసం సౌర మరియు పవన శక్తిపై ఆధారపడటం అనివార్యమని, కంటికి కనిపించని ఈ పవన శక్తే దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందని అభివర్ణించారు. ఇదే క్రమంలో దేశంలో జరుగుతున్న జనగణన2027 ప్రక్రియపై పౌరుల్లో అవగాహన కల్పించారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రతి భారతీయుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన ఈ డిజిటల్ జనగణనలో ప్రజలు అందించే సమాచారం అత్యంత సురక్షితంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఎన్యుమరేటర్లు ఇళ్లకు రాకముందే సెల్ఫ్ ఎన్యూమరేషన్ పోర్టల్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చని, దీనివల్ల సమయం ఆదా అవుతుందని సూచించారు. ఇప్పటికే కోటి 20 లక్షలకు పైగా కుటుంబాలు గృహగణనలో పాల్గొనడం శుభపరిణామమని పేర్కొన్నారు.

భారతీయ చేతివృత్తుల కళాకారులను, ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లో వెదురు ఉత్పత్తుల మీద ఆధారపడి జీవిస్తున్న వారిని ప్రోత్సహించాలని ప్రధాని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కళాత్మకమైన వెదురు ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా ఆ రంగంలోని కార్మికుల ఆత్మస్థైర్యాన్ని పెంచవచ్చని, ఇతరులకు బహుమతులు ఇచ్చేటప్పుడు ఇటువంటి స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అలాగే అంతర్జాతీయ వేదికలపై భారతీయ ఉత్పత్తుల సత్తాను ప్రస్తావిస్తూ, బ్రెజిల్‌లో జరిగిన అంతర్జాతీయ జున్ను పోటీల్లో రెండు భారతీయ బ్రాండ్‌లు అవార్డులు సాధించడం గర్వకారణమని చెప్పారు. మన దేశ సంప్రదాయ రుచులు ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయని, ఇది డైరీ రంగంలో మన ఎదుగుదలకు నిదర్శనమని కొనియాడారు. భారతదేశపు 'వోకల్ ఫర్ లోకల్' నినాదం ఇప్పుడు అంతర్జాతీయ స్థాయికి చేరుకుందని, భారతీయ ఉత్పత్తుల నాణ్యత ప్రపంచాన్ని ఆకర్షిస్తోందని ప్రధాని తన ప్రసంగంలో నొక్కి చెప్పారు. బుద్ధ పూర్ణిమ పండుగను పురస్కరించుకుని దేశ ప్రజలకు ముందస్తు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రధాని, గౌతమ బుద్ధుడి శాంతి సందేశాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రస్తుత కాలంలో ఒత్తిడులు, సవాళ్లు ఎదుర్కొంటున్న మానవత్వానికి బుద్ధుడి బోధనలు సరైన దిశను చూపిస్తాయన్నారు. లడఖ్‌లో జన్మించిన డ్రుబ్‌పోన్ ఓట్జెర్ రిన్‌పోచె అనే వ్యక్తి చిలీ వంటి సుదూర దేశంలో బౌద్ధ ధర్మాన్ని ప్రచారం చేయడం గొప్ప విషయమని మెచ్చుకున్నారు. చిలీలోని కోచిగువాజ్ లోయలో ఆయన బౌద్ధ స్థూపాన్ని నిర్మించారని, అక్కడ ప్రజలకు ధ్యానాన్ని నేర్పిస్తూ భారతీయ సంస్కృతిని చాటుతున్నారని తెలిపారు. కర్ణాటకలోని అటవీ ప్రాంతాల్లో ఉన్న కర్మ బౌద్ధ ఆశ్రమం గురించి కూడా ప్రస్తావిస్తూ, అడవుల పరిరక్షణలో ఆశ్రమం పాత్రను అభినందించారు. శాంతి అనేది మన నుంచే ప్రారంభం కావాలని బుద్ధుడు చెప్పిన మాటను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. ఈ విధమైన ఆధ్యాత్మిక, సామాజిక మరియు వైజ్ఞానిక పురోగతితో భారతదేశం విశ్వగురువుగా ఎదుగుతుందని ప్రధాని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

# అవసరానికి మించి నీళ్లు ఇవ్వలేం


**మొదటిపేజీ తరువాయి**

మేర తాగునీరు అందుతుందని, ప్రస్తుతం పైపులైన్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం ఐదు ప్రధాన వనరుల ద్వారా రోజుకు 600 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ, మంజీరా పైపులైన్లు బలహీనపడటం వల్ల కొంత ఇబ్బంది ఎదురవుతోందని వివరించారు. పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి వేసేందుకు ప్రభుత్వం రూ. 720 కోట్లు మంజూరు చేసిందని, దీనికి సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. అలాగే ఉస్మాన్‌సాగర్ నుంచి అదనంగా 25 ఎంజీడీల నీటిని తీసుకువచ్చేందుకు కొత్త పైపులైన్ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, ఇవి త్వరలోనే పట్టాలెక్కుతాయని ధీమా వ్యక్తం చేశారు. సింగూరు డ్యామ్ మరమ్మతుల కారణంగా ప్రస్తుతం అక్కడ కేవలం 8 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, వేసవిలో నీటి ఎద్దడి రాకుండా అత్యవసర పంపింగ్ ద్వారా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని జలమండలి తెలిపింది. సరఫరాలో జరుగుతున్న నష్టాలను తగ్గించేందుకు సాంకేతిక చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు కూడా తమ వంతుగా స్నానం చేసేటప్పుడు, బ్రష్ చేసుకునేటప్పుడు నీటిని వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ట్యాప్ వాటర్ లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వం తాగునీటి సరఫరాకు ఎక్కడా అంతరాయం కలగకుండా నిధులు మంజూరు చేస్తూ పనులను పర్యవేక్షిస్తోందని, ప్రజల సహకారం ఉంటేనే ఈ వేసవిని సులభంగా అధిగమించగలమని అశోక్ రెడ్డి ఆకాంక్షించారు. నీటిని పొదుపుగా వాడుతూ భావి తరాలకు జలనిధిని అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఆయన గుర్తు చేశారు.



# తెలంగాణలో చారిత్రక ఘట్టం

**మొదటిపేజీ తరువాయి**



చేయడం ద్వారా ఈ చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అదేవిధంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల సమక్షంలో తన వివరాలను ఎంటర్ చేసి సెల్ఫ్ ఎన్యూమరేషన్ పూర్తి చేసుకున్నారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, దేశంలోనే తెలంగాణను జనగణనలో అగ్రస్థానంలో నిలపాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. స్వీయగణన అనేది ప్రతి ఒక్కరికీ ఒక ఐచ్ఛికం మాత్రమేనని, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తమ వివరాలు తామే నమోదు చేసుకునే ఈ విధానం దేశ చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

జనగణన ప్రక్రియను రెండు దశల్లో నిర్వహించనున్నట్లు తెలంగాణ జనగణన డైరెక్టర్ భారతి హోళికేరి వెల్లడించారు. నేటి నుంచి ప్రారంభమైన మొదటి దశలో స్వీయ ధ్రువీకరణ కింద మొత్తం 33 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ మే 10వ తేదీ వరకు కొనసాగుతుంది. స్వీయగణన ముగిసిన తర్వాత మే 11 నుంచి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు నేరుగా క్షేత్రస్థాయిలో పర్యటించి హౌస్ లిస్టింగ్ ప్రక్రియ చేపడతారు. ఈ భారీ కసరత్తు కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 80 వేల మంది సిబ్బందిని వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నివాస గృహాలపై మార్కింగ్ చేయడం, కుటుంబాల వివరాలు సేకరించడం వంటి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రెండో దశ గణన ఉంటుందని, అప్పుడు వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని సమగ్రంగా సేకరిస్తామని డైరెక్టర్ వివరించారు. ఈ మొత్తం ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, సమాచార భద్రతకు ఎటువంటి భంగం కలగకుండా నిర్వహిస్తున్నట్లు భరోసా ఇచ్చారు. ఏవైనా సందేహాలు ఉంటే ప్రజలు 1855 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని సూచించారు.

హైదరాబాద్ మహానగరంలో జనగణన నిర్వహణ కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. కోర్ అర్బన్ రీ జియన్ పరిధిలోని మూడు కార్పొరేషన్లను ఒకే యూనిట్‌గా పరిగణించి, కంటోన్మెంట్ ప్రాంతంతో కలుపుకొని మొత్తం 61 చార్జ్ ఆఫీసర్లను నియమించినట్లు వెల్లడించారు. డిప్యూటీ కమిషనర్ స్థాయి అధికారులు ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తారని, నగరవాసులు తమ వివరాలను నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. 16 భాషల్లో పోర్టల్ అందుబాటులో ఉండటం వల్ల విభిన్న ప్రాంతాల ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. జనగణనతో పాటే కులగణన కూడా నిర్వహిస్తుండటం ఈసారి విశేషమని భారతి హోళికేరి పేర్కొన్నారు. దేశ జనాభా లెక్కల చరిత్రలోనే దీనిని 'మదర్ ఆఫ్ ఆల్ సెన్సెస్' (అన్ని సెన్సెస్ కు తల్లి వంటిది) గా అభివర్ణిస్తూ, ఈ బృహత్తర క్రతువులో ప్రజలందరూ భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. పారదర్శకమైన గణాంకాల వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పన, అమలు మరింత సమర్థవంతంగా మారుతుందని యంత్రాంగం ఆశిస్తోంది.

# రంగుల సినిమా చూపించి రేవంత్ అధికారంలోకి వచ్చాడు

**మొదటిపేజీ తరువాయి**



కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇటీవల శంషాబాద్ సమీపంలో తాము గతంలో తీసుకువచ్చిన ఒక కంపెనీ ప్రారంభోత్సవానికి రేవంత్ రెడ్డి వెళ్లారని, అక్కడ పిలిచే యాంకర్ కూడా ఆయనను గుర్తుపట్టలేకపోయిందని విమర్శించారు. ముఖ్యమంత్రి పేరు చెప్పడానికి బదులు మంత్రి శ్రీధర్ బాబు పేరును యాంకర్ ఉచ్చరించడాన్ని ప్రస్తావిస్తూ.. రేవంత్ రెడ్డి కేవలం తాము కట్టిన ప్రాజెక్టులకు రిబ్బన్లు కట్ చేయడం తప్ప కొత్తగా చేసిందేమీ లేదని దుయ్యబట్టారు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. “100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని జేమ్స్ బాండ్ తరహాలో బాండ్ పేపర్లు రాసి ఇచ్చారు. గ్యారెంటీ కార్డులను భద్రంగా దాచుకోమని భట్టి విక్రమార్క ప్రజలకు చెప్పారు. కానీ ఇప్పుడు 1000 రోజులు కావస్తున్నా ఆ కార్డులు ఎక్కడ పెట్టుకోవాలో చెప్పాలి” అని ప్రశ్నించారు. రైతు, మహిళా, యువజన డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ 420 అడ్డమైన హామీలు ఇచ్చి ప్రజలను వంచించిందని ఆరోపించారు.

హామీల అమలు గురించి అడిగితే రేవంత్ రెడ్డి వింత సమాధానాలు ఇస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. “మూడు నెలల్లో పిల్లలు పుడతారా? అని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నారు. సరే, మూడు నెలల్లో పుట్టకపోవచ్చు.. మరి 30 నెలలు గడిచినా ఒక్క హామీ అమలు కాకపోతే నిన్ను ఏమనాలి?” అని నిలదీశారు. కాంగ్రెస్ మాటలు ఆకాశంలో ఉన్నాయని, కానీ క్షేత్రస్థాయిలో పని మాత్రం సున్నా అని విమర్శించారు. నల్గొండ జిల్లాకు చెందిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై కూడా కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఆరడుగుల ఎత్తు ఉన్న ఉత్తమ్ వల్ల జిల్లాకు జరిగిన లాభం ఏమీ లేదని, కృష్ణా నీళ్లు తాగి పెరగడం తప్ప రైతుల కోసం ఆయన చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామని ఇప్పుడు నల్గొండ జిల్లా రైతులే స్వయంగా చెబుతున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# స్వీయ గణనలో పాల్గొన్న కిషన్ రెడ్డి

**హైదరాబాద్, (ఆంధ్ర మనం):**

2027 జనాభా లెక్కలకు సంబంధించి తెలంగాణలో 2026 ఏప్రిల్ 26న స్వీయ గణన అధికారికంగా ప్రారంభమైన సందర్భాన్ని పురస్కరించుకొని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జీ. కిషన్ రెడ్డి.. నిర్ణీత ఆన్‌లైన్ జనగణన పోర్టల్ ద్వారా తన వివరాలను నమోదు చేశారు. తెలంగాణ జనగణన కార్యాలయం ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి ప్రయాణంలో జనాభా లెక్కలు ఒక పునాది రాయి వంటివని అన్నారు. ప్రణాళికా రచన, సుపరిపాలన, సమానాభివృద్ధికి ఇవి కీలక సాధనాలుగా ఆయన అభివర్ణించారు. సమర్థవంతమైన విధాన రూపకల్పన, సమ్మిళిత వృద్ధికి ఖచ్చితత్వంతో కూడిన సమగ్రమైన గణాంకాలు చాలా అవసరమని ఆయన పేర్కొన్నారు. 2027 జనాభా లెక్కల ప్రాముఖ్యతను వివరించిన శ్రీ జీ. కిషన్ రెడ్డి... ఆధునిక డిజిటల్ సాంకేతికతను ఉపయోగించటం ద్వారా ఇదొక పరివర్తనాత్మక దశగా నిలుస్తుందని పేర్కొన్నారు. తద్వారా పారదర్శకత, సామర్థ్యం, సమ్మిళితత్వం మరింత పెరుగుతాయని ఆయన అన్నారు. 2026 ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణన సౌకర్యం అందుబాటులో ఉంటుందని.. ఆ తర్వాత 2026 మే 11 నుంచి జూన్ 9 వరకు గృహ జాబితా సేకరణ ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. ఇది సమగ్ర సమాచార సేకరణకు బలమైన పునాది వేస్తుందని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న సామాజికఆర్థిక పరిస్థితులపై 2027 జనాభా లెక్కలు స్పష్టమైన అవగాహనను కల్పిస్తాయని.. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందేలా చూడటంలో ఇవి సహాయపడతాయని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. జనాభా లెక్కల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరిన కేంద్ర మంత్రి.. ఇందులో ఖచ్చితమైన సమాచారాన్ని అందించాలని సూచించారు. సేకరించే ప్రతి సమాచారం దేశ భవిష్యత్తుతో పాటు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 'వికసిత్ భారత్' స్వప్నాన్ని సాకారం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ జనాభా లెక్కల డైరెక్టరేట్ సంచాలకులు భారతి హోళికేరి మాట్లాడుతూ.. అధికారిక వెబ్‌సైట్ అయిన https://se.census.gov.in లో స్వీయ గణన ప్రక్రియను పూర్తి చేయవచ్చని, తద్వారా జనాభా లెక్కల్లో నేరుగా పాల్గొనవచ్చని తెలిపారు. సమర్పించిన సమాచారం పూర్తి గోప్యంగా ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమాచారాన్ని సమర్పించిన వెంటనే ఒక 'స్వీయ గణన ఐడీ' వస్తుందని.. ఆ తర్వాత జనగణన అధికారి (ఎన్యూమరేటర్) దానిని పరిశీలించి ఖరారు చేస్తారని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వీ. కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు.



# మత్తు పదార్థాలతో ప్రాణహాని తప్పదు

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించిన నోటి క్యాన్సర్ మరాథాన్‌లో పాల్గొన్న ఆయన, 10కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, యువత యోగా, వ్యాయామం వంటి మంచి అలవాట్లను అలవరచుకోవాలని కోరారు.

చెడు అలవాట్ల వల్ల ప్రాణనష్టాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, సమాజంలో అవగాహన పెంపు అత్యవసరమని తెలిపారు. గుట్కా వంటి హానికర అలవాట్లపై చైతన్య కార్యక్రమాలుమరింత విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. పొగాకు వినియోగం వల్ల క్యాన్సర్ వంటి వ్యాధులు పెరుగుతున్నాయని హెచ్చరించి, వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

సైబరాబాద్ సీపీ రమేష్ 5కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. మరో అతిథిగా పాల్గొన్న బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్ రావు 2కే రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నోటి క్యాన్సర్ కారణంగా దేశంలో లక్షలాది మంది మరణిస్తున్నారని తెలిపారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు.

గ్లోబల్ ఓరల్ క్యాన్సర్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె. దిలీప్ కుమార్ మాట్లాడుతూ నోటి క్యాన్సర్‌పై అవగాహన పెంపు కోసం ఈ మరాథాన్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స సాధ్యమవుతుందని, కాబట్టి ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగ దీపిక, డాక్టర్ సౌమ్య, డాక్టర్ వినూత్న, డాక్టర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ సాఫ్ట్‌వేర్ సంస్థల ఐటీ ప్రొఫెషనల్స్, డాక్టర్లు, ప్రముఖులు, యువతతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు ప్రత్యేకంగా పాల్గొన్నారు.




# మలేరియా రహిత భారత్ దిశగా అడుగులు

**మొదటిపేజీ తరువాయి**




హబ్సిగూడలోని సీసీఎంబీ కేంద్రంలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా నిర్మూలనకు అవసరమైన మందులు, వ్యాక్సిన్ల తయారీలో నిమగ్నమైన పరిశ్రమల ప్రతినిధులు, వైద్య కళాశాలల నిపుణులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదన రావు మాట్లాడుతూ, 50వ దశకం నుంచి ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాల వల్ల మలేరియా కేసులు గణనీయంగా తగ్గినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అప్రమత్తత చాలా అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా వాతావరణ మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో దోమల సంతానోత్పత్తి వేగవంతమవుతోందని, ఇది వ్యాధి వ్యాప్తికి అనుకూలంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితమైన మలేరియా, ఇప్పుడు వలసలు మరియు పట్టణీకరణ వల్ల నగరాల్లో కూడా వేగంగా విస్తరిస్తోందని ఆయన వివరించారు.

మలేరియా పరాన్నజీవి మానవ శరీరంలో ప్రవేశించే తీరు, అది కలిగించే నష్టాలపై శాస్త్రవేత్తలు ఈ సదస్సులో కీలక విషయాలు వెల్లడించారు. దోమ కుట్టినప్పుడు విడుదలయ్యే స్పోరోజాయిట్స్ నేరుగా కాలేయానికి చేరుకుని వేల సంఖ్యలో మెరోజోయిట్స్‌గా వృద్ధి చెందుతాయని, ఈ దశలో రోగికి ఎటువంటి బాహ్య లక్షణాలు కనిపించవని సీసీఎంబీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పూరన్‌సింగ్ తెలిపారు. పరాన్నజీవులు కాలేయం నుంచి రక్తంలోని ఎర్ర రక్త కణాల్లోకి ప్రవేశించినప్పుడే మలేరియా లక్షణాలు బయటపడతాయని వివరించారు. ఈ క్రమంలో మలేరియాను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించడం అత్యంత ప్రధానమని శాస్త్రవేత్తలు సూచించారు. వైరస్ మరియు బ్యాక్టీరియాలతో పోలిస్తే మలేరియా పరాన్నజీవి నిర్మాణం చాలా సంక్లిష్టంగా ఉంటుందని, వీటిని ఎదుర్కొనే యాంటీబాడీలను అభివృద్ధి చేయడం శాస్త్రవేత్తలకు పెద్ద సవాలుగా మారిందని భారత్ బయోటెక్ ప్రతినిధులు వెల్లడించారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టీకాలతో పాటు, ఎంఆర్ఎన్ఏ సాంకేతికతతో కొత్త టీకాల తయారీపై పరిశోధనలు సాగుతున్నాయని, అయితే వీటి నిల్వ మరియు రవాణాలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయని పేర్కొన్నారు.

వ్యాధి నివారణకు కొత్తగా అందుబాటులోకి వస్తున్న సాంకేతికత మరియు ఔషధాల గురించి కాన్సిటెల్ లైఫ్ సైన్సెస్ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.కె. దాష్ వివరించారు. హిమాలయాల్లో లభించే మొక్కల సారం ఆధారంగా రూపొందించిన 'ఒపుణికా' అనే హెర్బల్ మందు రక్తంతో పాటు కాలేయంలోని పరాన్నజీవులను సమర్థవంతంగా అడ్డుకుంటున్నట్లు వెల్లడించారు. ఐఐటీ మద్రాస్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో కాలేయంలోనే వ్యాధి కారకాలను అంతం చేసే సాంకేతికతను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకటించిన అత్యధిక మలేరియా భారం ఉన్న దేశాల జాబితా నుంచి భారత్ బయటపడటం గొప్ప విజయమని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ వినయ్ నందికూరి కొనియాడారు. మలేరియాపై శాస్త్రీయ అవగాహన పెంచడంలో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ఫలిస్తోందని, త్వరలోనే మరింత శక్తివంతమైన వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాల్లో నివసించే చిట్టచివరి వ్యక్తికి కూడా వైద్య సేవలు అందినప్పుడే భారత్ మలేరియా రహిత దేశంగా ఆవిర్భవిస్తుందని సదస్సులో పాల్గొన్న నిపుణులు ముక్తకంఠంతో చాటిచెప్పారు.



## యువజన అభివృద్ధి – క్రీడా ప్రోత్సాహానికి 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రికొత్తగూడెం జిల్లా, ఏప్రిల్ 26 :**
యువత సమగ్ర అభివృద్ధి, క్రీడా రంగ ప్రోత్సాహం లక్ష్యంగా యువజన సర్వీసులు & క్రీడల శాఖ రూపొందించిన "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక" పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సిపిఓ సంజీవరావు, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతలో నైపుణ్యాలు, ఆరోగ్య సదృఢత, నాయకత్వ లక్షణాల పెంపుదల దిశగా ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మారథాన్, ఫిజికల్ లిటరసీ కార్యక్రమాలు, యువజన నాయకత్వ సదస్సు, స్పోర్ట్స్ డే వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మే 5 నుండి మే 12 వరకు జిల్లాల్లో జాబ్ మేళాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాల ద్వారా వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నిరుద్యోగ యువత తప్పనిసరిగా పాల్గొని ప్రయోజనం పొందాలని సూచించారు. పోస్టర్‌లో పొందుపరిచిన క్యూ ఆర్ కోడ్‌లను స్కాన్ చేసి మొబైల్ యాప్ లేదా వెబ్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మెరుగుపరచుకోవాలని పిలుపునిచ్చారు.



## భద్రాచలంలో ఘనంగా హిందూ సమ్మేళన పోస్టర్ ఆవిష్కరణ

**భద్రాద్రికొత్తగూడెం, ఏప్రిల్ 26 :**
భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో మే 3 ఆదివారం నిర్వహించనున్న "హిందూ సమ్మేళనం" కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో నేడు భద్రాచలం పట్టణంలోని కాకతీయ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన ముఖ్య సమన్వయ సమావేశం విజయవంతంగా ముగిసింది. సమావేశంలో భాగంగా సమ్మేళనానికి సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ప్రముఖుల సమక్షంలో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరియు కార్యక్రమ నిర్వాహకులు పాకాల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ హిందూ ధర్మ రక్షణ మరియు సమాజ ఐక్యతను బలోపేతం చేయడమే ఈ మహా సమ్మేళన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే పలు సమావేశాల ద్వారా ఏర్పాట్లను సమీక్షించామని, పోస్టర్ విడుదలతో ప్రచార కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తున్నామని పేర్కొన్నారు. సమ్మేళనాన్ని దిగ్విజయంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు

**గోదావరిఖని, ఏప్రిల్ 26 :**
భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరి శెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు కాటారం సబ్ డివిజన్ పరిధి లో డిఎస్పి సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు కమలా పూర్ క్రాస్ నుండి కాలేశ్వరం వరకు ఉన్నా రహదారిపై తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్లో ప్రమాద కరంగా ఉన్న ముల మలుపు లను స్థలాలను గుర్తించి ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేశారు ప్రమాదాలను నివారించేందుకు ఈ హెచ్చరిక బోర్డులను పోలీసు లు ఏర్పాటు చేశారు. అలాగే వాహన దారులు తప్పకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలి అని కాటారం ఎస్సై శ్రీనివాస్ హెచ్చరించారు.








# ప్రజల ముంగిటకే ప్రజావాణి

- రెవెన్యూ డివిజన్ స్థాయిలో అమలుకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం
- హైదరాబాద్ రానవసరం లేకుండా స్థానికంగా ఫిర్యాదుల పరిష్కారానికి నిర్ణయం
- డివిజన్ కేంద్రాల తర్వాత మండల స్థాయికి ప్రజావాణి సేవలు విస్తరణ
- ప్రతి అర్జీని నమోదు చేసి పరిష్కార పురోగతిని బాధితులకు వివరించాలి
- సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే సంబంధిత అధికారులదే బాధ్యత
- ఫిర్యాదుల ట్రాకింగ్ కోసం అత్యాధునిక ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం ఏర్పాటు
- పైస్థాయి అధికారులకు చేరేలా ఆటో ఎస్కలేషన్, అప్పీల్ వ్యవస్థల రూపకల్పన
- రియల్ టైమ్ మానిటరింగ్ కోసం ప్రత్యేక నోడల్ అధికారుల నియామకం
- ముగ్గురు అధికారుల కమిటీతో ప్రతి మూడు నెలలకు ఒకసారి సమగ్ర సమీక్ష

**హైదరాబాద్, ఏప్రిల్ 26:**
తెలంగాణ రాష్ట్రంలో ప్రజల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మరింత పకడ్బందీగా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి విస్తరించడం ద్వారా ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలని ఆయన సూచించారు. శుక్రవారం ఎంసీహెచ్ఆర్డీలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో పాల్గొన్న ముఖ్యమంత్రి, ప్రజలు తమ చిన్న చిన్న సమస్యల కోసం సుదూర ప్రాంతాల నుంచి హైదరాబాద్ లేదా జిల్లా కేంద్రాలకు రావాల్సిన అవసరం లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వెంటనే రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి సేవలు ప్రారంభించాలని, ఆ తర్వాత దశలో వీటిని మండల స్థాయికి విస్తరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు ఆదేశాలు జారీ చేశారు. స్థానిక సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే జిల్లా మరియు రాష్ట్ర స్థాయిల్లో పెండింగ్ అర్జీల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం అధికారం చేపట్టిన రెండో రోజే మహాత్మా జ్యోతిభా పూలే ప్రజా భవన్ వేదికగా ప్రారంభమైన ఈ కార్యక్రమం, ఇప్పుడు గ్రామ స్థాయి వరకు వెళ్లేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.
ఫిర్యాదుల పరిష్కార ప్రక్రియలో జవాబుదారీతనం పెంచేందుకు నిర్ణీత గడువులను నిర్ణయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు సమర్పించే ప్రతి అర్జీని డిజిటల్ పద్ధతిలో నమోదు చేయడంతో పాటు, ఆ ఫిర్యాదు ఏ దశలో ఉందో బాధితుడు తెలుసుకునేలా ఏకీకృత డిజిటల్ ప్లాట్‌ఫాం అభివృద్ధి చేయాలని ఆదేశించారు. జిల్లా మరియు రాష్ట్ర స్థాయిల్లో రియల్ టైమ్ మానిటరింగ్ ద్వారా పెండింగ్ ఫైళ్లను పర్యవేక్షించాలని సూచించారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా కింది స్థాయి అధికారి సమస్యను పరిష్కరించకపోతే, ఆ అర్జీ ఆటోమేటిక్ గా పైస్థాయి అధికారికి చేరేలా 'ఆటో ఎస్కలేషన్' వ్యవస్థను తీసుకురావాలని చెప్పారు. ప్రతి శాఖలో ప్రజావాణి కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని, ప్రత్యేక నోడల్ అధికారులను నియమించాలని స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు నిరంతరం ట్రాకింగ్ ఉండాలని, ఎక్కడైనా ఉద్దేశపూర్వక జాప్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ప్రజావాణిపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులదేనని ఆయన గుర్తు చేశారు.
ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో ప్రణాళిక శాఖ ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రజావాణి పనితీరుపై సమీక్షలు నిర్వహిస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. ప్రజావాణి ప్రారంభించిన నాటి నుంచి విశేష స్పందన లభిస్తోందని, నిరుపేదల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఫిర్యాదుదారులకు భరోసా కల్పించేలా అప్పీల్ వ్యవస్థను కూడా బలోపేతం చేయాలని సూచించారు. డ్యాష్ బోర్డ్ ద్వారా పరిష్కార పురోగతిని ముఖ్యమంత్రి కార్యాలయం నేరుగా పర్యవేక్షిస్తుందని తెలిపారు. వికేంద్రీకరణ ద్వారా పాలనను ప్రజల ముంగిటకే తీసుకెళ్లాలనే ప్రభుత్వ లక్ష్యం ప్రజావాణి ద్వారా నెరవేరుతుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేవలం అర్జీలు తీసుకోవడమే కాకుండా, వాటి పరిష్కారంలో నాణ్యత ఉండాలని, బాధితుడికి సంతృప్తికరమైన సమాధానం అందాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ప్రజావాణి సేవలు అందుబాటులోకి వస్తే సామాన్యులకు సమయం, డబ్బు ఆదా అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది.



# తెలంగాణలో కవిత పాంచజన్యం.. సాధ్యమేనా?

**వికారాబాద్, ఏప్రిల్ 26 :**
టీఆర్ఎస్ మాజీ నేత, మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ సీఎం కేసీఆర్ ముద్దుల కూతురు కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ పెట్టారు. ముందుగా చెప్పినట్లే టీఆర్ఎస్(తెలంగాణ రాష్ట్ర సేన) పేరుతో పార్టీ ప్రకటించారు.
మునీరాబాద్‌లో నిర్వహించిన సభలో పార్టీ పేరు జెండా, ఎజెండా ప్రకటించారు. ఇదే వేదికగా శ్రీకృష్ణుడి భగవద్గీత ప్రేరణతో 'పొలిటికల్ పాంచజన్యం' పేరుతో ఐదు ముఖ్య హామీలను ప్రకటించారు.

**అందరికీ ఉచిత విద్య..**
పాంచజన్యంలో తొలి హామీగా కవిత అందరికీ ఉచిత విద్యను ప్రకటించారు. ప్రభుత్వ, ప్రైవేటు వ్యవస్థలతో సంబంధం లేకుండా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా అందరికీ ఉచిత విద్య అందిస్తామని ప్రకటించారు. ఇది తల్లిదండ్రుల భారాన్ని తగ్గించి, విద్యా ప్రవేశాన్ని సమానత్వంగా చేస్తుంది.


**ఉచిత వైద్యం..**
పృటికే తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఆరోగ్యశ్రీ అమలు చేస్తున్నాయి. అయితే కొన్ని వ్యాధులకే ఇది వర్తిస్తుంది. దీంతో వైద్యం ఈ రోజుల్లో భారంగా మారిన నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలను ఆకట్టుకునేలా అందరికీ, అన్ని వ్యాధులకు ఉచిత వైద్యం అందిస్తామని ప్రకటించారు. ఏ ఆసుపత్రిలోనైనా, ఎంతటి ఖరీదైన చికిత్స అయినా ఉచితంగా అందేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇది ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న పేదలకు గొప్ప ఆశాకిరణం.

**రైతును రాజును చేస్తాం..**
అనేక ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి సాయం ఇస్తున్నాయి. కేంద్రం కూడా పీఎం కిసాన్ పేరుతో ఆర్థికసాయం చేస్తుంది. అయితే కవిత ఇలా పెట్టుబడి సాయం ప్రనకటించకుండా కుల వృత్తులను కాపాడతామని, రైతుని రాజుగా మార్చుతామని హామీ ఇచ్చారు. వ్యవసాయ సంస్కరణలు, మద్దతు ధరలు ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు.

**యువశక్తికి ప్రాధాన్యం..**
ఇక యువతను ఆకట్టుకునేలా ఉపాధికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. స్వయం ఉపాధిని ప్రోత్సహించేలా ఎలాంటి గ్యారంటీ లేకుండా ప్రభుత్వంమే గ్యారంటీగా ఉండి రుణాలు ఇస్తామని తెలిపారు. ఇక ఉద్యోగాలు చేయడానికి ఒకే నోటిఫికేషన్‌తో ఏడాదిలో 4 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు.

**సామాజిక న్యాయం..**
ఇక చివరి హామీగా సామాజిక న్యాయాన్ని ప్రకటించారు. అందరికీ సమన్యాం చేయడమే తమ పార్టీ లక్ష్యమన్నారు. చట్టసభల్లో మహిళలకు 50% సీట్లు, ఎస్సీ/ఎస్టీ/బీసీలతోపాటు అగ్రవర్ణ పేదలకు న్యాయం. ఇది సామాజిక సమతుల్యతను పెంచుతూ, అందరినీ కవర్ చేసే ప్రయత్నం చేశారు.

**అమ్మగా ప్రమోట్..**
తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలిగా కవిత పార్టీ ఆవిర్భావ సభలో తనను తాను అమ్మగా ప్రమోషన్ చేసుకున్నారు. ప్రతీ హామీ ముందు అమ్మగా తనకు తెలుసు.. బిడ్డల బాధ తల్లికి తెలుసు అంటూ పదే పదే మాట్లాడారు. తద్వారా తెలంగాణలో ఇకపై తనను కవితక్కగా కాకుండా కవితమ్మగా పిలిచేలా ప్రమోట్ చేసుకున్నారు. అమ్మతనంతో పనిచేస్తానని తెలిపారు.
పాంచజన్యం ఎజెండా విద్య, ఆరోగ్యం, రైతులు, యువత, సామాజిక న్యాయం అంశాలపై దృష్టి సార్వత్రికంగా ఆకట్టుకునేలా ఉంది. టీఆర్ఎస్ నుంచి విడిపోయిన కవితకు ఇది బలమైన రీఎంట్రీ స్ట్రాటజీ. అయితే, అమలు సామర్థ్యం, ఆర్థిక మూలాలు, పోటీ పార్టీల సవాళ్లు కీలకం. తెలంగాణ ఓటర్లు ఈ 'గీతా ప్రేరణ'ను ఎలా స్వీకరిస్తారో రాబోయే ఎన్నికల్లో తేలనుంది.



# మల్కాపూర్ చెరువు గట్టున పునర్వైభవానికి సిద్ధమైన పురాతన శివాలయం

- మల్కాపూర్ చెరువు గట్టున పునర్వైభవానికి సిద్ధమైన పురాతన శివాలయం
- నేటినుంచే ప్రతిష్ఠాపన మహోత్సవాలు – ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ

**కొండాపూర్, ఏప్రిల్ 26 :**
కొండాపూర్ మండలం మల్కాపూర్ గ్రామం పెద్దచెరువు వద్ద సుమారు వంద ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన పురాతన శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయం నేడు పునర్నిర్మాణంతో నూతన శోభను సంతరించుకుంది. ప్రకృతి ఒడిలో, ఆహ్లాదకరమైన సరస్సు తీరాన కొలువుదీరిన ఈ ఆలయ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఏప్రిల్ 27 నుండి మే 01 వరకు ఐదు రోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఈ కార్యక్రమాలను మల్కాపూర్ గ్రామ పురోహితులైన యెల్లాప్రగడ రఘువీర్ శర్మ మరియు యెల్లాప్రగడ మణిశర్మ ఆధ్వర్యం నిర్వహించనున్నారు.

**చారిత్రక నేపథ్యం – ఆధ్యాత్మిక ప్రాశస్త్యం**
శతాబ్ద కాలం క్రితం నిర్మించిన ఈ శివాలయం స్థానికులకు ఎంతో సెంటిమెంట్. కాలక్రమేణా శిథిలావస్థకు చేరుకున్న ఈ ఆలయాన్ని గ్రామస్తులు, భక్తుల సహకారంతో అద్భుతమైన శిల్పకళతో పునర్నిర్మించారు. చెరువు నీటి అలల మధ్య, ప్రశాంతమైన వాతావరణంలో కొలువై ఉన్న ఈ శివలింగం సాక్షాత్తు ఆ పరమశివుని అవతారంగా భక్తులు విశ్వసిస్తారు.

**ఐదు రోజుల కార్యక్రమాల వివరాలు:**
మొదటిరోజు ఉదయం గణపతి పూజతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. అగ్నిప్రతిష్ట, గణపతి హోమం, కార్యక్రమాలు జరుగుతాయి. ఆవాహిత దేవతపూజా, జలదివాసం మరియు ప్రత్యేక హోమాలు నిర్వహిస్తారు. గర్భాలయంలో విగ్రహ మూర్తుల ప్రతిష్ఠాపన, యంత్ర స్థాపన ఘట్టం జరగనుంది. మహా పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ట మరియు విజయోత్సవ సమావేశం అనంతరం భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**అందరికీ ఆహ్వానం**
ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి మల్కాపూర్ గ్రామం ముస్తాబైంది. ఈ వేడుకలకు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు. పచ్చని ప్రకృతి, చెరువు గట్టున వెలసిన ఈ శివయ్యను దర్శించుకుని పునీతులు కావాలని గ్రామస్తులు సాదరంగా ఆహ్వానిస్తున్నారు.







# నిందితుడు ఒకప్పుడు బెస్ట్ టీచర్

## కాల్టెక్ గ్రాడ్యుయేట్.. నాసాలో రీసెర్చ్ ఫెలో..

## అలెన్ ప్రొఫైల్‌లో షాకింగ్ వివరాలు

## హింసకు పాల్పడాలనే లక్ష్యంతోనే దాడి?

## యూఎస్ అటార్నీ విచారణలో కీలక అంశాలు

**వాషింగ్టన్:** వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ డిన్నర్ వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై దాడికి తెగబడిన నిందితుడు కోల్ థామస్ అలెన్ సాదాసీదా వ్యక్తి కాదని, అతడొక ఉన్నత విద్యావంతుడని వెల్లడైన వివరాలు అంతర్జాతీయ సమాజాన్ని విస్మయానికి గురిచేస్తున్నాయి. కాలిఫోర్నియాలోని టోరెన్స్‌కు చెందిన 31 ఏళ్ల అలెన్, అత్యంత ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థల్లో పట్టాలు పొందడమే కాకుండా శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ అనుభవం గడించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఒక మేధావిగా ఎదగాల్సిన వ్యక్తి ఇలా హంతకుడిగా మారడం వెనుక గల కారణాలపై ఇప్పుడు సర్వత్రా చర్చ నడుస్తోంది.

### ఉన్నత విద్య.. నాసాతో అనుబంధం

అలెన్ విద్యా నేపథ్యం ఎంతో ఘనంగా ఉంది. ప్రపంచ ప్రఖ్యాత కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన అలెన్, ఆ తర్వాత 2017లో కాలిఫోర్నియా స్టేట్ యూనివర్సిటీ – డొమినిగెజ్ హిల్స్ నుండి కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీని అందుకున్నాడు. అంతటితో ఆగకుండా, 2014లో నాసాకు చెందిన జెట్ ప్రొపల్షన్ లేబొరేటరీ నిర్వహించిన అండర్ గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఫెలోషిప్ ప్రోగ్రామ్‌లో కూడా పాలుపంచుకున్నాడు. తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్‌లో తనను తాను 'మెకానికల్ ఇంజనీర్ మరియు కంప్యూటర్ సైంటిస్ట్'గా అభివర్ణించుకున్నాడు.

### ఉత్తమ టీచర్‌గా గుర్తింపు.. గేమ్ డెవలపర్‌గా..

అలెన్ కేవలం విద్యార్థిగానే కాకుండా ఉపాధ్యాయుడిగానూ గుర్తింపు పొందడం గమనార్హం. టెస్ట్ ప్రిపరేషన్ శిక్షణ ఇచ్చే ప్రముఖ సంస్థ 'సీ2 ఎడ్యుకేషన్'లో పార్ట్‌టైమ్ టీచర్‌గా పనిచేసిన అలెన్, 2024 డిసెంబర్ నెలకు గాను 'బెస్ట్ టీచర్'గా అవార్డు కూడా అందుకున్నాడు. విద్యార్థులకు పాఠాలు చెప్పే వ్యక్తి ఇలా హింసామార్గం పట్టడంపై తోటి సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు 'బోర్‌డోమ్', 'ఫస్ట్‌లా' వంటి వీడియో గేమ్స్‌ను కూడా అతడు డిజైన్ చేసినట్లు సోషల్ మీడియా ప్రొఫైల్స్ ద్వారా తెలుస్తోంది.

### హింసపై స్పష్టమైన లక్ష్యంతోనే..

యూఎస్ అటార్నీ (డిస్ట్రిక్ట్ ఆఫ్ కొలంబియా) వెల్లడించిన వివరాల ప్రకారం, నిందితుడు అలెన్ పక్కా ప్రణాళికతోనే ఈ దాడికి పాల్పడ్డాడు. అత్యాధునిక ఆయుధాలతో భద్రతా వలయాన్ని ఛేదించేందుకు ప్రయత్నించిన అతడు, తీవ్రస్థాయిలో హింసకు పాల్పడాలనే కృతనిశ్చయంతో వచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ అధికారిపై కాల్పులు జరపడం, అక్రమంగా ఆయుధాలు కలిగి ఉండటం వంటి సెక్షన్ల కింద అలెన్‌పై కేసు నమోదు చేశారు. అయితే, ఇంతటి విద్యావంతుడు, సమాజంలో మంచి గుర్తింపు ఉన్న వ్యక్తి ఇలాంటి ఘాతుకానికి ఎందుకు ఒడిగట్టాడు? దీని వెనుక ఏదైనా ఉగ్రవాద భావజాలం ఉందా? లేక వ్యక్తిగత వైఫల్యాలే కారణమా? అనే కోణంలో ఎఫ్‌బీఐ లోతుగా దర్యాప్తు చేస్తోంది.

# రన్వేపై స్విస్ ఎయిర్ విమానంలో మంటలు

## టేకాఫ్ సమయంలో ఇంజిన్ వైఫల్యం..

## అత్యవసరంగా కిందకు దిగిన 228 మంది ప్రయాణికులు



**న్యూఢిల్లీ :** న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం తెల్లవారు జామున జరిగిన విమాన ప్రమాదం కలకలం రేపింది. స్విస్ ఎయిర్‌కు చెందిన విమానం ఇంజిన్‌లో టేకాఫ్ సమయంలో లోపం తలెత్తి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఢిల్లీ నుంచి జ్యూరిక్‌కు వెళ్లాల్సిన ఈ విమానం టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఒక ఇంజిన్ పనిచేయకపోవడంతో మంటలు చెలరేగాయి. వెంటనే పైలట్లు టేకాఫ్‌ను నిలిపివేసి అత్యవసర చర్యలు ప్రారంభించారు. విమానంలో ఉన్న ప్రయాణికులను అత్యవసర స్లైడ్ల ద్వారా కిందకు దించారు. ఈ సమయంలో తలెత్తిన గందరగోళంలో ఆరుగురు ప్రయాణికులు గాయపడ్డారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ ఎయిర్‌బస్ ఏ330 విమానంలో సుమారు 228 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నట్లు సమాచారం. అగ్ని ప్రమాదం సంభవించగానే సిబ్బంది చురుకుగా స్పందించడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని అధికారులు తెలిపారు. 'భారతదేశ కాలమానం ప్రకారం ఆదివారం తెల్లవారుజామున 1 గంట దాటిన తర్వాత ప్రమాదం చోటు చేసుకుంది. విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే, ఇంజన్లలో ఒకదానిలో సమస్య తలెత్తింది. సిబ్బంది టేకాఫ్‌ను రద్దు చేసి, ముందు జాగ్రత్తగా విమానాన్ని ఖాళీ చేయించారు. ప్రస్తుతం ఆరుగురు ప్రయాణికులకు వైద్య సహాయం అందుతోంది. సిబ్బంది క్షేమంగా ఉన్నారు' అని స్విస్ ఎయిర్‌లైన్స్ ఓ ప్రకటనలో తెలిపింది.

# ట్రంప్‌పై హత్యాయత్నం

- వైట్‌హౌస్ డిన్నర్ వద్ద కాల్పుల కలకలం
- నిందితుడి ఫోటోను విడుదల చేసిన ట్రంప్..
- 'ఇతడో మానసిక రోగి' అని ధ్వజం
- ప్రాణాలకు తెగించి అడ్డుకున్న సీక్రెట్ సర్వీస్ అధికారి.. అమెరికాలో హై అలర్ట్





**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొన్న ప్రతిష్టాత్మక 'వైట్‌హౌస్ కరస్పాండెంట్స్ అసోసియేషన్ డిన్నర్' వేడుక రక్తసిక్తమైంది. వాషింగ్టన్‌లోని హిల్టన్ హోటల్‌లో శనివారం రాత్రి అట్టహాసంగా జరుగుతున్న ఈ విందులో ఒక్కసారిగా తుపాకీ శబ్దాలు వినిపించడంతో యావత్ అమెరికా దిగ్భ్రాంతికి గురైంది. వేదికపై ట్రంప్ ప్రసంగించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఈ దాడి జరగడం సంచలనం సృష్టించింది. ఈ ఘోరానికి ఒడిగట్టిన నిందితుడి ఫోటోను, వీడియోను ట్రంప్ స్వయంగా తన 'ట్రూత్ సోషల్' వేదికగా విడుదల చేస్తూ, అతడిని ఒక మానసిక రోగిగా అభివర్ణించారు.

### తీవ్ర ఉత్కంఠ.. టేబుళ్ల కింద దాక్కున్న అతిథులు

వందలాది మంది జర్నలిస్టులు, రాజకీయ ప్రముఖులు, సెలబ్రిటీలతో కిక్కిరిసిన హోటల్ ప్రాంగణంలో కాల్పుల శబ్దం వినిపించగానే హాహాకారాలు మొదలయ్యాయి. ఏం జరుగుతుందో అర్థం కాక అతిథులు ప్రాణభయంతో టేబుళ్ల కింద, కుర్చీల వెనుక దాక్కున్నారు. నిమిషాల వ్యవధిలోనే రంగంలోకి దిగిన సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు మెరుపు వేగంతో స్పందించి ట్రంప్, ఆయన భార్య మెలానియాను సురక్షిత ప్రాంతానికి తరలించారు. వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కాల్పులు కలకలం రేపడంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను భద్రతా సిబ్బంది హుటాహుటిన తరలించారు. ఈ క్రమంలో ఆయన అదుపుతప్పి కిందపడిపోయారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌ను సైతం భద్రతా సిబ్బంది జాకెట్ పట్టుకుని లాక్కెళ్లారు. టాక్టికల్ బృందాలు హోటల్‌ను తమ ఆధీనంలోకి తీసుకుని నిందితుడిని అడ్డుకోవడంలో విజయం సాధించాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

### బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ ధరించి వచ్చిన నిందితుడు

దాడికి పాల్పడిన వ్యక్తిని కాలిఫోర్నియాకు చెందిన కోల్ థామస్ అలెన్ (31)గా అధికారులు గుర్తించారు. నిందితుడు అత్యంత పకడ్బందీగా బుల్లెట్ ప్రూఫ్ వెస్ట్ ధరించి, అత్యాధునిక ఆయుధాలతో భద్రతా వలయాన్ని ఛేదించేందుకు ప్రయత్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో నిందితుడిని అడ్డుకున్న ఒక సీక్రెట్ సర్వీస్ అధికారి ఛాతీలోకి బుల్లెట్ దూసుకెళ్లింది. అదృష్టవశాత్తూ ఆ అధికారి కూడా జాకెట్ ధరించి ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం నిందితుడు భద్రతా దళాల అదుపులో ఉండగా, ఎఫ్‌బీఐ ఈ కుట్ర వెనుక ఉన్న ఉగ్రవాద కోణాలపై ఆరా తీస్తోంది.

### సీక్రెట్ సర్వీస్ సాహసంపై ప్రశంసలు

ఘటన అనంతరం వైట్‌హౌస్ నుండి దేశాన్ని ఉద్దేశించి మాట్లాడిన డొనాల్డ్ ట్రంప్.. తన ప్రాణాలను కాపాడిన సీక్రెట్ సర్వీస్ అధికారుల ధైర్యసాహసాలను కొనియాడారు. కాల్పుల్లో గాయపడిన అధికారిని 'హీరో'గా అభివర్ణించిన ట్రంప్, అమెరికాలో ఇలాంటి హింసాత్మక చర్యలకు తావులేదని స్పష్టం చేశారు. ఈ భయానక వాతావరణం కారణంగా రద్దయిన విందు కార్యక్రమాన్ని రాబోయే 30 రోజుల్లో మరింత ఘనంగా నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం వాషింగ్టన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసిన అధికారులు, ఈ దాడి వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీసే పనిలో ఉన్నారు.

## ఇరాన్‌తో చర్చలు రద్దు చేసిన ట్రంప్..

ఈ దాడి జరిగిన కొద్దిసేపటికే ట్రంప్ అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. ఇరాన్‌తో శాంతి చర్చల కోసం పాకిస్థాన్‌కు వెళ్లాల్సిన తన రాయబార బృందం పర్యటనను తక్షణమే రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్ పంపిన శాంతి ప్రతిపాదనలు ఏమాత్రం సంతృప్తికరంగా లేవని, అందుకే జారెడ్ కుష్నర్, స్టీవ్ విట్కాఫ్ బృందాన్ని వెళ్లవద్దని ఆదేశించానని తెలిపారు. "ప్రయోజనం లేని విషయాల గురించి మాట్లాడటానికి మా వాళ్లు 18 గంటల పాటు విమాన ప్రయాణం చేయాల్సిన అవసరం లేదు. అన్ని కార్డులు మా దగ్గరే ఉన్నాయి.. వాళ్లే మాకు కాల్ చేయాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు.

## దాడిని ఖండించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: అమెరికాలో యాన్యువల్ ప్రెస్ డిన్నర్ సందర్భంగా చోటుచేసుకున్న కాల్పులపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'వాషింగ్టన్ డీసీలోని ఓ హోటల్‌లో ఇటీవల జరిగిన భద్రతా పరమైన ప్రమాదం నుంచి అధ్యక్షుడు ట్రంప్, ప్రథమ మహిళ, ఉపాధ్యక్షుడు సురక్షితంగా బయటపడ్డారని తెలుసుకుని ఊరట చెందాను. వారు ఎప్పుడూ క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నాను. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు. దాడిని ఖచ్చితంగా ఖండించాల్సిందే' అని

# పవన శక్తిలో భారత్ సరికొత్త రికార్డు

- 56 గిగావాట్లకు చేరిన ఉత్పత్తి..
- నాలుగో స్థానానికి చేరిన భారత్
- బుద్ధుని బోధనలే ప్రపంచానికి దిక్సూచి..
- జనగణన-2027కు సహకరించాలి
- 'మన్‌కీ బాత్'లో ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ, ఏప్రిల్26:** పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగంలో భారతదేశం మరో చారిత్రాత్మక మైలురాయిని అధిగమించిందని ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం జరిగిన 'మన్‌కీ బాత్' కార్యక్రమంలో ఆయన దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో పవన శక్తి ఉత్పత్తి 56 గిగావాట్లకు పైగా నమోదవుతోందని, గతేడాదితో పోలిస్తే అదనంగా 6 గిగావాట్ల ఉత్పత్తిని సాధించామని వెల్లడించారు. పవన శక్తి ఉత్పత్తిలో భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే నాలుగో స్థానంలో నిలిచిందని, దేశాభివృద్ధిలో సౌర, పవన శక్తి కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. పునరుత్పాదక విద్యుత్‌తోనే భవిష్యత్తు తరాలకు ఇంధన భద్రత లభిస్తుందని ప్రధాని అభిప్రాయపడ్డారు. బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని, ప్రస్తుత ప్రపంచ పరిస్థితుల్లో భగవాన్ బుద్ధుని బోధనలు ఎంతో అవసరమని గుర్తుచేశారు. "శాంతి అనేది మన లోపలే మొదలవుతుందని బుద్ధుడు బోధించారు. తనను తాను జయించడమే అన్నిటికంటే గొప్ప విజయమని ఆయన మనకు తెలియజేశారు. నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న ఉద్రిక్తతలు, సంఘర్షణల నేపథ్యంలో బుద్ధుని మార్గాన్ని అనుసరించడమే ఏకైక పరిష్కారం" అని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతికి అహింస, సహనం అత్యంత ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. భారత అణుశక్తి రంగంలో సాధించిన మరో గొప్ప విజయం గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. తమిళనాడులోని కల్పక్కంలో ఉన్న ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ 'క్రిటికాలిటీ'ని సాధించిందని, ఇది భారత న్యూక్లియర్ సైంటిస్టుల పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. ఈ ఘనత ద్వారా భారతదేశం అణు ఇంధన రంగంలో స్వయం సమృద్ధి దిశగా మరో అడుగు వేసిందని, ఈ ప్రాజెక్టు కోసం కృషి చేసిన శాస్త్రవేత్తలందరికీ దేశం తరపున అభినందనలు తెలియజేశారు.

### జనగణన-2027 విజయవంతం చేద్దాం

రాబోయే జనగణన ప్రక్రియ గురించి మోదీ మాట్లాడుతూ, ఇది కేవలం ప్రభుత్వ విధి మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. "జనగణనలో మీ భాగస్వామ్యం ఎంతో కీలకం. మీరు ఇచ్చే ప్రతి సమాచారం ప్రభుత్వం వద్ద సురక్షితంగా, గోప్యంగా ఉంటుంది. దేశ భవిష్యత్తు ప్రణాళికల కోసం ఈ సమాచారం ఎంతో అవసరం. జనగణన–2027ని విజయవంతం చేయడంలో అందరూ భాగస్వాములు కావాలి" అని దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. సామాజిక అభివృద్ధిలో పౌరుల సహకారం ఉంటేనే మెరుగైన ఫలితాలు వస్తాయని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.

# ఆప్ ఫిరాయింపు ఎంపీలపై అనర్హత వేటు వేయండి

## ఏడుగురు ఎంపీల విలీనం రాజ్యాంగ విరుద్ధం..

## రాజ్యసభ చైర్మన్‌కు సంజయ్‌సింగ్ విన్నపం

**న్యూఢిల్లీ:** రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీకి తగిలిన భారీ కుదుపు ఇప్పుడు చట్టపరమైన పోరాటానికి దారితీసింది. ఆప్ టిక్కెట్టుపై గెలిచి ఇటీవల బీజేపీలో చేరిన ఏడుగురు రాజ్యసభ సభ్యులపై అనర్హత వేటు వేయాలని కోరుతూ ఆ పార్టీ ఆదివారం రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌ను ఆశ్రయించింది. ఆప్ సీనియర్ నేత, ఎంపీ సంజయ్‌సింగ్ ఈ మేరకు చైర్మన్‌కు అధికారికంగా వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, ఎంపీల చర్యలు పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోని పదో షెడ్యూల్ నిబంధనలకు స్పష్టమైన విరుద్ధమని ధ్వజమెత్తారు. ముఖ్యంగా ఫిరాయింపులకు పాల్పడిన వారిలో ఆరుగురు పంజాబ్ నుండి ఆప్ తరఫున ఎన్నికైనవారని సంజయ్‌సింగ్ గుర్తుచేశారు. ప్రజలు ఒక సిద్ధాంతాన్ని నమ్మి ఓటేస్తే, ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తూ బీజేపీలో చేరడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని ఆక్షేపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడాలంటే అక్రమంగా పార్టీ మారిన వారి సభ్యత్వాన్ని తక్షణమే రద్దు చేయాలని ఆయన కోరారు. ఈ విషయంలో కపిల్ సిబల్ వంటి రాజ్యాంగ నిపుణుల సలహాలు తీసుకున్నామని, చట్టప్రకారం ఆ ఎంపీలు అనర్హతకు గురవ్వడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### సిద్ధాంతాలకు తిలోదకాలిచ్చారు: రాఘవ్ చద్దా

కాగా, గత శుక్రవారం అనూహ్య పరిణామాల మధ్య రాఘవ్ చద్దా, హర్భజన్ సింగ్, స్వాతి మలివాల్ సహా ఏడుగురు సభ్యులు బీజేపీ తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ తన మూల సిద్ధాంతాలను విస్మరించిందని, అందుకే తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వారు ఆరోపించారు. తమ గ్రూపులో మూడింట రెండు వంతుల మంది సభ్యులు ఉన్నారని, రాజ్యాంగ నిబంధనల ప్రకారం తమ విలీనం చెల్లుబాటు అవుతుందని రాఘవ్ చద్దా వాదిస్తున్నారు. రాజ్యసభలో ఆప్‌కు ఉన్న పది మంది సభ్యుల్లో ఏడుగురు తమతోనే ఉన్నందున అనర్హత వేటు పడే అవకాశం లేదని ఆయన చెప్పుకొచ్చారు.



### రాజ్యాంగ నిపుణుల తీర్పుపై ఉత్కంఠ

రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీకి ఉన్న బలం ఈ పరిణామంతో ఒక్కసారిగా మూడుకు పడిపోయింది. విలీనం చెల్లుతుందని ఒక వర్గం, అది పక్కా ఫిరాయింపేనని మరో వర్గం వాదిస్తుండటంతో ఇప్పుడు బంతి రాజ్యసభ చైర్మన్ కోర్టులోకి చేరింది. ఒకవేళ వీరిపై అనర్హత వేటు పడితే పంజాబ్ రాజకీయాల్లో కూడా తీవ్ర మార్పులు వచ్చే అవకాశం ఉంది. దేశ రాజధాని వేదికగా సాగుతున్న ఈ రాజకీయ చదరంగంలో అంతిమంగా రాజ్యాంగ నిబంధనలు ఎవరికి అనుకూలంగా ఉంటాయనేది ఇప్పుడు జాతీయ స్థాయిలో ఆసక్తికరంగా మారింది.



# నూతన వెంచర్ ప్రారంభించిన ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

**సూర్యాపేట, రాజముద్ర న్యూస్**

సూర్యాపేట పట్టణం నడిబొడ్డిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం పక్కన 30 ఎకరాల విశాలమైన ప్రదేశంలో పటేల్స్ పెరల్ పేరుతో కౌన్సిలర్ తన్వీర్ ఆద్వర్యంలో అతిపెద్ద వెంచర్ ను ఏర్పాటు చేయడం హర్షనీయమని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. ఆదివారం నాడు సూర్యాపేట కలెక్టరేట్ సమీపంలోని పటేల్స్ పెరల్ వెంచర్ ను మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం నడిబొడ్డులో ఇంత పెద్ద వెంచర్ ను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని ఈ వెంచర్ లో 340 ప్లాట్లు రూపొందించి, అన్ని రకాల అనుమతులు తీసుకొని ఇంటి నిర్మాణానికి అనువుగా అభివృద్ధి చేసిన ఫార్చ్యూన్ గ్రూప్, ఆశ్వి కన్స్ట్రక్షన్స్ వారికి అభినందనలు తెలియజేశారు. సూర్యాపేట పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతుందని, పట్టణ ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశంలో అన్ని సౌకర్యాలతో, ప్లాట్లు చేశారని, పట్టణ ప్రజలు ప్లాట్ల కొనుగోలు చేయడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని ఆయన అన్నారు.కేవలం రెండు మూడు నెలలలోనే ఈ ప్లాట్లు అన్ని కూడా కొనుగోలు అయ్యే అవకాశం ఉందని తెలియజేశారు కౌన్సిలర్ తన్వీర్ కుటుంబం ఇక్కడ స్థానికంగా భూస్వాములని వారు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్ లు తన్వీర్, కొండపల్లి దిలీప్ రెడ్డి, పార్చ్యూన్ గ్రూప్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# టోల్‌ప్లాజా వద్ద ఎమ్మెల్యే అనుచరుల వీరంగం





- టోల్ ఫీజు అడిగినందుకు మేనేజర్, సిబ్బందిపై మండిపాటు
- మహిళా ఉద్యోగిపై గన్‌మన్ దాడి
- సీఎం చంద్రబాబు సీరియస్!
- బాధ్యులపై కేసులకు ఆదేశం

**అమరావతి, ఏప్రిల్26:** అన్నమయ్య జిల్లా కల్యాణదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అనుచరులు టోల్ ప్లాజా సిబ్బందిపై దాడికి పాల్పడటం తీవ్ర కలకలం రేపుతున్నది. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం గండబోయినపల్లె టోల్ ప్లాజా వద్ద నిన్న ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ గొడవకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కాగా, ఘటనపై భిన్న కథనాలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే, కల్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు తన అనుచరులతో కలిసి తిరుమల దర్శనం ముగించుకుని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారిపై ఉన్న గండబోయినపల్లె టోల్‌గేట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ సిబ్బంది ఎమ్మెల్యే వాహనాన్ని గుర్తించినప్పటికీ టోల్ ఫీజు చెల్లించాలని కోరడంతో వివాదం మొదలైంది. దీంతో ఆగ్రహానికి గురైన ఎమ్మెల్యే అనుచరులు, గన్‌మన్ రెచ్చిపోయారు. "ఎమ్మెల్యే వాహనాన్నే ఆపుతారా?" అంటూ సిబ్బందిపై దాడికి దిగారు. గన్‌మన్ టోల్ బ్యారియర్‌ను ధ్వంసం చేయడంతో పాటు, టోల్‌ప్లాజా మేనేజర్ రవిపై, మహిళా ఉద్యోగిని శ్రీలతపై చేయి చేసుకున్నాడు. మహిళ జుట్టు పట్టుకుని కొట్టిన దృశ్యాలు సీసీటీవీలో స్పష్టంగా రికార్డయ్యాయి. ఈ ఘటన జరిగినంతసేపు ఎమ్మెల్యే సురేంద్రబాబు తన వాహనంలోనే ఉండటం గమనార్హం. అయితే, ఈ ఆరోపణలపై ఎమ్మెల్యే సురేంద్రబాబు స్పందించారు. టోల్ సిబ్బందే తమతో దురుసుగా ప్రవర్తించారని, రుసుము చెల్లించడానికి సిద్ధంగా ఉన్నా దాదాపు 10 నిమిషాల పాటు వాహనాన్ని నిలిపివేశారని ఆయన తెలిపారు. తమ సిబ్బంది ప్రతిఘటించారే తప్ప దాడి చేయలేదని వివరించారు. మేనేజర్‌ను కిడ్నాప్ చేయలేదని, అతని ప్రవర్తనపై ఫిర్యాదు చేసేందుకు వాయల్పాడు పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లామని, అనంతరం వారు క్షమాపణ చెప్పడంతో వివాదం ముగిసిందని సురేంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు, ఈ ఘటనపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, కేసు నమోదు చేయలేదని వాల్మీకిపురం పోలీసులు స్పష్టం చేశారు. దీంతో ఈ వివాదంపై గందరగోళం నెలకొంది. అయితే, ఎమ్మెల్యే అనుచరులు టోల్ ప్లాజా వద్ద సిబ్బందిపై దౌర్జన్యం చేసిన దృశ్యాలు అక్కడి సీసీ టీవీ ఫుటేజీలో రికార్డు అవ్వడంతో అవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

### తప్పు చేస్తే సొంత పార్టీ వారైనా వదిలేది లేదు

రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారిపై ఉన్న గండబోయినపల్లె టోల్‌ప్లాజా వద్ద కల్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అనుచరులు, గన్‌మన్లు చేసిన దాడిపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులపై కఠినమైన కేసులు నమోదు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఇలాంటి సంస్కృతిని ఏమాత్రం సహించబోనని హెచ్చరించారు. బాధితులకు న్యాయం చేయాలని మరియు మహిళా ఉద్యోగిపై దాడి చేసిన వారిని తక్షణమే గుర్తించి అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించారు. ఈ పరిణామంతో అన్నమయ్య జిల్లా రాజకీయాల్లో తీవ్ర చర్చ మొదలైంది.

# రుద్రంపేట ఘటనపై మహిళా కమిషన్ సీరియస్

- చైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఆరా
- చిన్నారిపై అత్యాచారయత్నం చేసిన కామాంధుడికి కఠిన శిక్ష పడేలా చూడాలని ఆదేశం
- వైసీపీ నేతను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని స్థానికుల ఆగ్రహం..



**అమరావతి:** అనంతపురం జిల్లా రుద్రంపేటలో ఆరేళ్ల చిన్నారిపై జరిగిన అత్యాచారయత్నం ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ అమానుష ఘటనపై ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ తీవ్రంగా స్పందించారు. ఆదివారం ఆమె జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు తక్షణమే న్యాయం అందేలా చూడాలని, చిన్నారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున పూర్తి అండగా ఉండాలని ఆమె ఆదేశించారు. చైర్‌పర్సన్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రుద్రంపేటలో ఆరేళ్ల చిన్నారిపై ఒక రాజకీయ పార్టీకి చెందిన నేత అఘాయిత్యానికి ఒడిగట్టడం స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నిందితుడిని పట్టుకున్న స్థానికులు అతడికి దేహశుద్ధి చేసి నాలుగో పట్టణ పోలీసులకు అప్పగించారు. అయితే, నిందితుడు అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేత కావడంతో పోలీసులు కేసు నమోదు చేయకుండా జాప్యం చేస్తున్నారని, రాజీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని బాధిత కుటుంబ సభ్యులు మరియు స్థానికులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు.

### మతిస్థిమితం లేదంటూ తప్పించే కుట్ర!

పోలీసుల తీరుపై స్థానికులు మండిపడుతున్నారు. నిందితుడికి మతిస్థిమితం లేదనే కుంటి సాకుతో కేసును పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారి ప్రాణాలతో చెలగాటమాడిన వ్యక్తిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, అతడిపై కఠిన చట్టాల కింద కేసు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మహిళా కమిషన్ జోక్యం చేసుకోవడంతో కేసు విచారణ వేగవంతం అవుతుందని భావిస్తున్నారు.

### ప్రభుత్వం అండగా ఉంటుంది: అధికారులు

మహిళా కమిషన్ ఆదేశాలతో బాధిత కుటుంబాన్ని కలిసిన ఉన్నతాధికారులు, చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. చట్టపరమైన చర్యలు వేగవంతం చేసి, బాధితులకు తక్షణ న్యాయం అందేలా చూస్తామని ప్రకటించారు. నిందితుడు ఎంతటి వారైనా సరే చట్టం ముందు సమానమేనని, ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు లేకుండా విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. ఈ ఘటనతో జిల్లాలో మహిళా సంఘాలు, ప్రజా సంఘాలు ఆందోళనకు సిద్ధమవుతున్నాయి.

# వినియోగదారుల మన్ననలు పొందాలి



**సూర్యాపేట,రాజముద్ర న్యూస్**

సూర్యాపేట జిల్లా కేంద్రంలో డి మార్ట్ దగ్గర మండి డి లైట్ రెస్టారెంట్ ను ప్రారంభించిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పోతు భాస్కర్ మున్సిపల్ చైర్మన్ మొరిశెట్టి నివేదిత లక్షాది ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, మన్సూర్ బి, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, పిసిసి ఎస్సి సెల్ వైస్ చైర్మన్, మాజీ జెడ్పిటిసి చింతమళ్ల రమేష్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, సేవదల్ చీఫ్ ఆలేటి మాణిక్యం, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేందర్ నాయుడు, పడిదల రవి, చెంచల నిఖిల్ నాయుడు, నాగు నాయక్ పాల్గొన్నారు.

# వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో వాసవి మాత జయంతి ఉత్సవాలు





**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :**

ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న వాసవి మాత జయంతి ఉత్సవాలను వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ సమావేశం హాలులో ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం వైశాఖ శుక్ల పక్ష శతమి నాడు వాసవి మాతా జయంతి ఉత్సవాలను రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సందర్భంగా వాసవి మాతా జయంతి ఉత్సవం ఆదివారం అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఉమా శంకర్ ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన గావించి పూలమాల అలంకరించారు. ఈ కార్యక్రమంలో క్రీడాల అభివృద్ధి అధికారి సత్తార్, వైశ్య సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# గొల్లపల్లి లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్**


రామారెడ్డి మండలం గొల్లపల్లి గ్రామం లో ఆదివారం రోజున గ్రామ సర్పంచ్ కిషన్ యాదవ్ వరి కొనుగోలు కేంద్రాన్ని టెంకాయలు కొట్టి ప్రారంభిం చారు, వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర పొందాలని రైతులకు తెలిపారు, రైతులు దళారులకు వరి ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని అన్నారు, ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈఓ లింగమూర్తి, పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, కొనుగోలు కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు

# విజయవాడ బస్టాండ్‌లో అగ్నిప్రమాదం..

### తప్పిన పెను ప్రమాదం..



**విజయవాడ, ఏప్రిల్ 26:** నగరంలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ లో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. బస్టాండ్‌లోని డిపార్చర్ బ్లాక్‌లో ఉన్న ఏసీ మిషన్లలో షార్ట్ సర్క్యూట్ కావడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బస్టాండ్‌లోని 48, 49, 50 నంబర్ ప్లాట్‌ఫారమ్‌ల వద్ద ఉన్న ఏసీ యూనిట్లలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే మంటలు ఎగసిపడటంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగలు అలుముకోవడంతో ప్రయాణికులు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన అధికారులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఏసీల్లో షార్ట్ సర్క్యూట్ వల్లే మంటలు వ్యాపించినట్లు గుర్తించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అధికారులు వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేసి పరిస్థితిని సమీక్షించారు.



# ఇదే మంచి ఛాన్స్

## 2 రోజులుగా స్థిరంగా బంగారం ధరలు..

### స్థిరంగా బంగారం, వెండి ధరలు



**(మనసలో మాట, బిజినెస్ డెస్క్):**

నానాటికీ ఆకాశాన్ని తాకుతున్న పసిడి ధరలు గత కొద్ది రోజులుగా తగ్గుముఖం పట్టడం వినియోగదారులకు పెద్ద ఊరటనిస్తోంది. దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు వరుసగా రెండో రోజూ ఎలాంటి మార్పు లేకుండా స్థిరంగా కొనసాగుతున్నాయి. గత వారం రోజులుగా భారీగా తగ్గిన ధరలు, ఒక్కసారి మాత్రమే పెరిగి ప్రస్తుతానికి అదే స్థాయిలో నిలకడగా ఉన్నాయి. అంతర్జాతీయంగా పెరుగుతున్న ఉద్రిక్తతలు మరియు రికార్డ్ స్థాయిలో ఉన్న క్రూడ్ ఆయిల్ ధరల ప్రభావం పసిడి ధరలు మరింత పెరగకుండా అడ్డుకుంటున్నట్లు బులియన్ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

### హైదరాబాద్ మార్కెట్‌లో ధరల తీరు


ఏప్రిల్ 26వ తేదీ ఆదివారం నాటి సమాచారం ప్రకారం, హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర 10 గ్రాములకు ఎటువంటి మార్పు లేకుండా రూ. 1,54,040 వద్ద ట్రేడవుతోంది. అదేవిధంగా, ఆభరణాల తయారీకి వాడే 22 క్యారెట్ల బంగారం ధర కూడా స్థిరంగా ఉంటూ 10 గ్రాములకు రూ. 1,41,200 వద్ద అమ్ముడవుతోంది. ఏప్రిల్ 24న ధరలు స్వల్పంగా పెరిగినప్పటికీ, మునుపటి రికార్డ్ గరిష్ఠాలతో పోలిస్తే ఇవి సామాన్యులకు కొంత అందుబాటులోనే ఉన్నాయని చెప్పవచ్చు.

### రూ. 2.70 లక్షల వద్దే వెండి

బంగారం దారిలోనే వెండి ధరలు కూడా స్థిరత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. క్రితం రోజు కిలోపై ఏకంగా రూ. 5,000 తగ్గి ఊరటనిచ్చిన వెండి, ఈరోజు అదే ధర వద్ద కొనసాగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి రేటు రూ. 2,70,000 వద్ద ట్రేడవుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో స్పాట్ సిల్వర్ రేటు ఔన్సుకు 75.69 డాలర్ల వద్ద అమ్ముడవుతుండగా, స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 4,708 డాలర్ల వద్ద స్థిరంగా ఉంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో రూపాయి విలువ డాలరుతో పోలిస్తే ప్రస్తుతం రూ. 94.27 వద్ద కొనసాగుతోంది.

### కొనుగోలుదారులకు సూచన

గ్లోబల్ మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చితుల కారణంగా బంగారం, వెండి ధరలు ఎప్పుడు మారుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొంది. అందుకే కొనుగోలుదారులు స్థానికంగా ఉండే పన్నులు, తరుగు (మేకింగ్ ఛార్జీలు) వంటి వివరాలను ముందే సరిచూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రాంతాలను బట్టి ఈ ధరల్లో స్వల్ప తేడాలు ఉండే అవకాశం ఉంది. ఏది ఏమైనా గత కొద్ది రోజులుగా ధరలు భారీగా తగ్గడం, ప్రస్తుతం స్థిరంగా ఉండటంతో ఇదే బంగారం కొనుగోలుకు సరైన సమయమని పసిడి ప్రియులు భావిస్తున్నారు.






# మైలేజీ మొనగాడు

- మహింద్రా నుండి 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ' సీఎన్‌జీ వెర్షన్!
- కిలోకు 30 కిలోమీటర్ల మైలేజీ.. లగ్జరీ ఫీచర్లు, గరిష్ఠ భద్రతే లక్ష్యం
- టాటా నెక్సాన్, మారుతీ బ్రెజ్జాలకు గట్టి పోటీ..
- త్వరలోనే మార్కెట్లోకి విడుదల

**(మనసులో మాట - ఆటో డెస్క్)**

భారతీయ వాహన దిగ్గజం మహింద్రా అండ్ మహింద్రా, మధ్యతరగతి వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంధన పొదుపులో సరికొత్త విప్లవానికి తెరలేపింది. పెరుగుతున్న పెట్రోల్ ధరలతో బెంబేలెత్తుతున్న సామాన్యులకు ఊరటనిస్తూ, తన అత్యంత ప్రజాదరణ పొందిన 'ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ' మోడల్‌ను ఇప్పుడు సీఎన్‌జీ వెర్షన్‌లో విడుదల చేసేందుకు సిద్ధమైంది. అత్యాధునిక సాంకేతికత మరియు అద్భుతమైన మైలేజీ కలయికతో రూపొందుతున్న ఈ కారు, ప్రత్యర్థి కంపెనీలకు గట్టి సవాల్ విసరడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

### లీటరుకు 30 కిలోమీటర్ల మైలేజీ?

ఈ కొత్త సీఎన్‌జీ వేరియంట్ ప్రధాన ఆకర్షణ దాని మైలేజీ. ప్రాథమిక నివేదికల ప్రకారం, ఈ కారు కిలో సీఎన్‌జీకి సుమారు 25 నుంచి 30 కిలోమీటర్ల మైలేజీని ఇచ్చే అవకాశం ఉంది. 1.2 లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజన్‌తో పాటు కంపెనీ ఫిట్టెడ్ సీఎన్‌జీ కిట్‌ను ఇందులో అమర్చారు. దీనివల్ల కారు పవర్ తగ్గకుండానే తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే వీలుంటుంది. రోజువారీ ఆఫీసు ప్రయాణాలు చేసే వారికి మరియు నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవాలనుకునే వారికి ఇది ఒక వరం లాంటిదని చెప్పవచ్చు.

### రూపంలో రాజీ లేదు.. ఫీచర్లలో మేటి

సాధారణంగా సీఎన్‌జీ కార్లంటే ఫీచర్లు తక్కువగా ఉంటాయనే అపోహను మహింద్రా పటాపంచలు చేస్తోంది. ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ సీఎన్‌జీలో పనోరమిక్ సన్‌రూఫ్, 360-డిగ్రీల కెమెరా, పెద్ద టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ మరియు వైర్‌లెస్ కనెక్టివిటీ వంటి ప్రీమియం ఫీచర్లను అందిస్తున్నారు. డిజైన్ పరంగా కూడా ప్రస్తుత మోడల్ లాగే ధృడమైన స్పోర్టీ లుక్, ఎల్ఈడీ హెడ్ లాంప్స్ మరియు ఆకర్షణీయమైన గ్రిల్‌తో ఇది ఆకట్టుకోనుంది. లోపలి భాగంలో మెత్తని మెటీరియల్ డాష్‌బోర్డ్ ప్రయాణీకులకు లగ్జరీ అనుభూతినిస్తుంది.




### భద్రతకు పెద్దపీట

భద్రతా ప్రమాణాల్లో ఎప్పుడూ ముందుండే మహింద్రా, ఈ సీఎన్‌జీ వెర్షన్‌లోనూ 6 ఎయిర్ బ్యాగ్స్‌ను ప్రామాణికంగా ఇస్తోంది. నాలుగు చక్రాలకు డిస్క్ బ్రేకులు, అధునాతన ప్రమాద నివారణ వ్యవస్థలతో పాటు ధృడమైన ఛాసిస్‌ను దీనికి వాడారు. అయితే, వెనుక భాగంలో సీఎన్‌జీ ట్యాంక్ అమర్చడం వల్ల బూట్ స్పేస్ (సామాన్లు పెట్టుకునే స్థలం) కొంచెం తగ్గే అవకాశం ఉంది. టాటా నెక్సాన్ సీఎన్‌జీ వంటి హేమాహేమీలకు గట్టి పోటీ ఇవ్వడమే లక్ష్యంగా మహింద్రా ఈ కారును రంగంలోకి దింపుతోంది. తక్కువ ధరలో ఎక్కువ ఫీచర్లు మరియు మైలేజీ కోరుకునే వారికి ఈ ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ ఒక సరైన ఎంపిక కానుంది.

# రిలయన్స్ రిటైల్‌తో కలిసి 'ఫెంటీ బ్యూటీ' లాంచ్



**ముంబై:** ప్రపంచ ప్రఖ్యాత పాప్ సింగర్ మరియు 'ఫెంటీ బ్యూటీ' బ్రాండ్ అధినేత్రి రిహానా మరోసారి భారతీయ ఆతిథ్యానికి ముగ్ధురాలయ్యారు. తన బ్యూటీ బ్రాండ్‌ను అధికారికంగా భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టేందుకు ముంబై వచ్చిన ఆమె, ఆదివారం ముఖేశ్ అంబానీ నివాసం 'అంటిలియా'ను సందర్శించారు. అంబానీ కుటుంబం రిహానాకు భారతీయ సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికింది. అత్యంత సన్నిహితుల మధ్య జరిగిన ప్రత్యేక విందు (లంచ్) కార్యక్రమంలో ఆమె పాల్గొని, అంబానీ కుటుంబ సభ్యులతో సరదాగా గడిపారు. ఈ పర్యటనలో రిహానా కేవలం అతిథిగానే కాకుండా భారతీయ సంస్కృతిలో భాగస్వామిగా కనిపించారు. ఇషా అంబానీ, రాధికా మర్చంట్, శ్లోకా మెహతా మరియు అనంత్ అంబానీలు ఆమెకు మన సంప్రదాయ కళలు, నృత్య రీతుల గురించి వివరించారు. ఈ సందర్భంగా అంటిలియాలోని దేవాలయంలో రిహానా ఆరతి కార్యక్రమంలో పాల్గొనడం విశేషం. అంతేకాకుండా, ఆమె ఆవుకు లడ్డూలు తినిపించి గోమాత పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారు. పండుగ వాతావరణం నెలకొనేలా అంబానీ కుటుంబం ఏర్పాటు చేసిన 'పూల హోళీ'లో రిహానా ఆనందంగా చిందులు వేశారు.

### ఫెంటీ బ్యూటీ - రిలయన్స్ రిటైల్

రిహానా ఈ పర్యటన ముఖ్య ఉద్దేశ్యం తన సొంత బ్యూటీ బ్రాండ్ 'ఫెంటీ బ్యూటీ'ని భారతదేశంలో లాంచ్ చేయడం. రిలయన్స్ రిటైల్ భాగస్వామ్యంతో ఈ ఉత్పత్తులను ఆమె మార్కెట్లోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ బ్రాండ్ ఉత్పత్తులు రిలయన్స్ యాజమాన్యంలోని 'తీరా', 'సెఫోరా' ప్లాట్‌ఫామ్‌లలో ప్రత్యేకంగా అందుబాటులో ఉన్నాయి. శనివారం రాత్రి జరిగిన లాంచ్ ఈవెంట్‌లోనూ ఆమె భారతీయ ఆభరణాలను (మనీష్ మల్హోత్రా రూపొందించిన హత్ ఫూల్) ధరించి అందరినీ ఆకట్టుకున్నారు.




## ముంబైలో స్పెషల్ పాప్-అప్ ఈవెంట్

### ముఖేశ్ అంబానీ ఇంటికి పాప్ సింగర్ రిహానా



### గత పరిచయంతో మరింత సాన్నిహిత్యం

2024లో అనంత్ అంబానీ-రాధికా మర్చంట్‌ల ప్రీ-వెడ్డింగ్ వేడుకల్లో రిహానా ప్రదర్శన ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి నుండే ఆమెకు అంబానీ కుటుంబంతో మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ తాజా పర్యటనలోనూ ఆత్మీయ పలకరింపులు, ముచ్చట్లతో ఆ బంధం మరింత బలపడింది. విందు అనంతరం 'థ్యాంక్యూ'ని హిందీలో ఎలా చెప్పాలో తెలుసుకుని, అభిమానులకు 'శుక్రియా' చెప్పి ఆమె అందరి మనసు గెలుచుకున్నారు. 'ఫెంటీ కీ హవేలీ' పేరుతో ముంబైలో ఏర్పాటు చేసిన పాప్-అప్ స్టోర్ మే 4వ తేదీ వరకు సందర్శకులకు అందుబాటులో ఉండనుంది.


# సన్‌రైజర్స్‌పై పగ తీర్చుకున్న 'బాస్ బేబీ'..

## వైభవ్‌కు ఫ్యాన్ అయిపోయానన్న ప్యాట్ కమిన్స్

**జైపూర్:** ఐపీఎల్‌లో 'బాస్ బేబీ'గా పిలవబడే యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాటింగ్‌తో క్రికెట్ ప్రపంచాన్ని షేక్ చేశాడు. ఆదివారం జైపూర్ వేదికగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెడుతూ కేవలం 36 బంతుల్లోనే సెంచరీ మార్కును అందుకుని ఐపీఎల్ చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించాడు. గత మ్యాచ్‌లో ఎదురైన పరాభవానికి అదే జట్టుపై శతకంతో బదులిచ్చి తన సత్తా చాటాడు. ఈ సీజన్‌లో గతంలో ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్‌తో జరిగిన మ్యాచ్ వైభవ్‌కు ఒక చేదు జ్ఞాపకంగా మిగిలింది. తన ఐపీఎల్ కెరీర్‌లోనే తొలిసారి ఆ మ్యాచ్‌లో డకౌట్ అయిన వైభవ్, మైదానంలోనే కన్నీళ్లు పెట్టుకున్న దృశ్యాలు అభిమానులను కలచివేశాయి. అయితే, ఇప్పుడు జైపూర్‌లోని తన హోం గ్రౌండ్‌లో అదే హైదరాబాద్ జట్టుపై విరుచుకుపడి పగ తీర్చుకున్నాడు. 12 భారీ సిక్సర్లు, 5 ఫోర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించిన వైభవ్, 103 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఎల్బీడబ్ల్యూగా వెనుదిరిగాడు. అతని దూకుడు చూసిన స్టేడియం మొత్తం 'వైభవ్.. వైభవ్' అనే నినాదాలతో హోరెత్తిపోయింది.

### నేను అతని కొత్త ఫ్యాన్‌ను: ప్యాట్ కమిన్స్

వైభవ్ విధ్వంసకర ఇన్నింగ్స్ ప్రత్యర్థి జట్టు కెప్టెన్, ఆస్ట్రేలియా దిగ్గజం ప్యాట్ కమిన్స్‌ను సైతం మంత్రముగ్ధుడిని చేసింది. మ్యాచ్ అనంతరం కమిన్స్ మాట్లాడుతూ.. "ఇప్పటి నుంచి వైభవ్ నా కొత్త ఫేవరెట్ ప్లేయర్. బంతిని అతను ఎంత బలంగా బాదుతున్నాడో చూస్తుంటే ముచ్చటేస్తోంది. అతని బ్యాటింగ్ శైలి నాకు బాగా నచ్చింది. నేను అతనికి అభిమానిగా మారిపోయాను" అని ప్రశంసల జల్లు కురిపించాడు. ఒక ప్రపంచ స్థాయి బౌలర్ నుంచి ఇలాంటి గుర్తింపు రావడం వైభవ్ ఎదుగుదలకు నిదర్శనమని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ప్రియాన్ష్‌కు ప్రీతి జింటా 'పంచ్'

ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ చారిత్రక విజయం సాధించిన తర్వాత ఆ జట్టు సహ యజమాని ప్రీతి జింటా ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గెలుపు తర్వాత మైదానంలోకి వచ్చిన ఆమె యువ ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్యను అభినందిస్తూ సరదాగా ఓ పంచ్ ఇచ్చారు. ఆ సమయంలో ప్రియాన్ష్ ఫన్నీగా స్పందించగా ఈ ఘటనను చూసిన కామెంటేటర్ రవిశాస్త్రి "ఓహ్, అది మంచి పంచ్" అని వ్యాఖ్యానించాడు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ నిర్దేశించిన 265 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ ఛేదించింది. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యధిక విజయవంతమైన ఛేజింగ్ కావడం విశేషం. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (26 బంతుల్లో 76), ప్రియాన్ష్ ఆర్య (17 బంతుల్లో 43) అద్భుత ఆరంభం ఇవ్వగా, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (36 బంతుల్లో 71 నాటౌట్) విజయ లాంఛనాన్ని పూర్తి చేశాడు. ఇంకా 7 బంతులు మిగిలి ఉండగానే పంజాబ్ 6 వికెట్ల తేడాతో విజయాన్ని అందుకుంది. ఈ భారీ ఛేదనలో ప్రభ్‌సిమ్రన్, ప్రియాంశ్ కేవలం 6.5 ఓవర్లలోనే 126 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి విజయానికి పటిష్టమైన పునాది వేశారు. అంతకుముందు, తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ క్యాపిటల్స్ 2 వికెట్లకు 264 పరుగుల భారీ స్కోరు సాధించింది. కేఎల్ రాహుల్ కేవలం 67 బంతుల్లో 16 ఫోర్లు, 9 సిక్సర్లతో 152 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ఐపీఎల్ చరిత్రలో ఓ భారత బ్యాటర్ చేసిన అత్యధిక స్కోరు ఇదే కావడం గమనార్హం. అతనికి తోడుగా నితీశ్ రాణా (44 బంతుల్లో 91) రాణించాడు. రాహుల్ అద్భుత ఇన్నింగ్స్‌తో ఢిల్లీ గెలుపు ఖాయమనిపించినా, పంజాబ్ బ్యాటర్ల ఎదురుదాడితో మ్యాచ్ ఫలితం తారుమారైంది. ఈ విజయంతో పంజాబ్ కింగ్స్ ఈ సీజన్‌లో తమ అజేయ యాత్రను కొనసాగిస్తోంది.

# సూపర్ ఓవర్‌లో కోల్‌కతా సూపర్ హిట్!

- ఆఖరి బంతి వరకు ఉత్కంఠ.. టైగా ముగిసిన మ్యాచ్
- సూపర్ ఓవర్లో లక్నోను దెబ్బతీసిన సునీల్ నరైన్
- నైట్ రైడర్స్ ఇన్నింగ్స్‌లో అదరగొట్టిన రింకూ సింగ్
- ఒంటరి పోరాటంతో 83 పరుగులు సాధించిన స్టార్ బ్యాటర్
- ఐదు వికెట్లతో చెలరేగిన లక్నో బౌలర్ మొహసిన్ ఖాన్



ఆదివారం లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్ అభిమానులకు అసలైన టీట్వంటీ మజాను పంచింది. ఆఖరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్ స్కోర్లు సమం కావడంతో టైగా ముగిసింది. ఫలితం తేల్చేందుకు నిర్వహించిన సూపర్ ఓవర్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ అద్భుత విజయాన్ని అందుకుంది. మొదట రింకూ సింగ్ ఒంటరి పోరాటం, ఆ తర్వాత బౌలర్ల సమిష్టి కృషితో కోల్‌కతా ఈ మ్యాచ్‌ను దక్కించుకుంది.

### రింకూ సింగ్ వీరోచిత ఇన్నింగ్స్

టాస్ గెలిచిన లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో మొదట బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్‌కు ఆశించిన శుభారంభం దక్కలేదు. అయితే.. స్టార్ బ్యాటర్ రింకూ సింగ్ మాత్రం ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా బాధ్యతాయుతంగా ఆడుతూ కేవలం యాభై ఒక్క బంతుల్లోనే 83 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతనికి తోడుగా ఆల్ రౌండర్ కెమెరాన్ గ్రీన్ 21 బంతుల్లో 34 పరుగులు సాధించాడు. అజింక్య రహానే 10 పరుగులకే వెనుదిరిగాడు. లక్నో బౌలర్లలో మొహసిన్ ఖాన్ అద్భుతమైన బౌలింగ్ తో ఏకంగా ఐదు వికెట్లు పడగొట్టి కోల్‌కతాను భారీ దెబ్బ తీశాడు. దీంతో నిర్ణీత ఇరవై ఓవర్లలో కోల్‌కతా ఏడు వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది.



### చివరి దాకా ఉత్కంఠ..

156 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్ కూడా తడబడుతూనే ఇన్నింగ్స్ కొనసాగించింది. రిషబ్ పంత్ ముప్పై ఎనిమిది బంతుల్లో 42 పరుగులు, ఎయిడెన్ మార్క్రామ్ ఇరవై ఏడు బంతుల్లో 31 పరుగులు సాధించి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. చివర్లో ఆయుష్ బదోని 19 బంతుల్లో 24 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగెత్తించాడు. కానీ కోల్‌కతా బౌలర్లు వైభవ్ అరోరా (రెండు వికెట్లు), వరుణ్ చక్రవర్తి (రెండు వికెట్లు) కట్టుదిట్టంగా బంతులు వేయడంతో లక్నో కూడా ఇరవై ఓవర్లలో ఎనిమిది వికెట్లు కోల్పోయి సరిగ్గా 155 పరుగులే చేసింది. ఇరు జట్ల స్కోర్లు సమం కావడంతో మ్యాచ్ సూపర్ ఓవర్‌కు దారి తీసింది.

### నరైన్ మాయ.. కేకేఆర్ గెలుపు

ఫలితం కోసం నిర్వహించిన సూపర్ ఓవర్లో కోల్‌కతా స్పిన్నర్ సునీల్ నరైన్ మాయ చేశాడు. ముందుగా బ్యాటింగ్ చేసిన లక్నో జట్టును దారుణంగా దెబ్బతీశాడు. కేవలం మూడు బంతులు మాత్రమే వేసి ఒక్క పరుగు ఇచ్చి రెండు కీలక వికెట్లు పడగొట్టాడు. దీంతో నిబంధనల ప్రకారం లక్నో ఇన్నింగ్స్ ముగిసింది. కోల్‌కతా ముందు కేవలం రెండు పరుగుల అత్యల్ప లక్ష్యం నిలిచింది. లక్నో బౌలర్ ప్రిన్స్ యాదవ్ వేసిన మొదటి బంతినే రింకూ సింగ్ బౌండరీకి తరలించడంతో.. ఇంకా ఐదు బంతులు మిగిలి ఉండగానే కోల్‌కతా నైట్ రైడర్స్ ఘన విజయాన్ని సొంతం చేసుకుంది.

# చెపాక్‌లో టైటాన్స్ గర్జన!

- చెన్నై పై ఎనిమిది వికెట్ల తేడాతో గుజరాత్ ఘనవిజయం
- వృథా అయిన రుతురాజ్ గైక్వాడ్ ఒంటరి పోరాటం
- బంతితో రబడ, బ్యాటుతో సాయి సుదర్శన్ మాయ
- ఇరవై బంతులు మిగిలి ఉండగానే ముగిసిన మ్యాచ్






**చెన్నై:** సొంత గడ్డపై చెన్నై సూపర్ కింగ్స్‌కు చేదు అనుభవం ఎదురైంది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా ఆదివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ ఎనిమిది వికెట్ల తేడాతో ఆతిథ్య జట్టును చిత్తు చేసింది. సమష్టి కృషితో చెలరేగిన గుజరాత్.. ఆట అన్ని విభాగాల్లోనూ చెన్నైని అధిగమించి అద్భుత విజయాన్ని సొంతం చేసుకుంది.

### తడబడిన చెన్నై..

టాస్ గెలిచిన గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్ మన్ గిల్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్ కు దిగిన చెన్నై సూపర్ కింగ్స్ ఏ దశలోనూ భారీ స్కోరు చేసేలా కనిపించలేదు. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంతో ఆతిథ్య జట్టు పరుగులు రాబట్టడానికి తీవ్రంగా ఇబ్బంది పడింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మాత్రం ఒకవైపు వికెట్లు పడుతున్నా బాధ్యతాయుతంగా ఆడాడు. అరవై బంతులు ఎదుర్కొన్న రుతురాజ్ 74 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. మిగతా బ్యాటర్లలో శివమ్ దూబే (పదిహేడు బంతుల్లో 22), ఆఖర్లో జేమీ ఓవర్టన్ (ఆరు బంతుల్లో 18) కాస్త వేగంగా ఆడటంతో చెన్నై నిర్ణీత ఇరవై ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 158 పరుగులు చేయగలిగింది.

### రబడ నిప్పులు చెరిగే బంతులు..

గుజరాత్ బౌలర్లలో స్టార్ పేసర్ కగిసో రబడ అద్భుతమైన స్పెల్ తో చెన్నై నడ్డివిరిచాడు. తన కోటా నాలుగు ఓవర్లలో కేవలం 25 పరుగులు మాత్రమే ఇచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. ఇతనికి తోడుగా అర్షద్ ఖాన్ నాలుగు ఓవర్లలో 43 పరుగులిచ్చి రెండు వికెట్లు తీశాడు. స్పిన్నర్ మానవ్ సుతార్ తన మూడు ఓవర్లలో 22 పరుగులిచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు.

### చెదిరిన లక్ష్యం.. చెలరేగిన సుదర్శన్..

159 పరుగుల మోస్తరు లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ కు ఓపెనర్లు శుభ్ మన్ గిల్, సాయి సుదర్శన్ శుభారంభం అందించారు. ముఖ్యంగా సాయి సుదర్శన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. చెన్నై బౌలర్లను ఆటాడుకుంటూ కేవలం 46 బంతుల్లోనే 87 పరుగులు సాధించాడు. గిల్ 23 బంతుల్లో 33 పరుగులు చేసి ఔట్ కాగా, ఆ తర్వాత వచ్చిన జోస్ బట్లర్ 30 బంతుల్లో 39 పరుగులతో అజేయంగా నిలిచి లాంఛనాన్ని పూర్తి చేశాడు. దీంతో గుజరాత్ జట్టు 16.4 ఓవర్లలోనే కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి 162 పరుగులు సాధించింది. ఇంకా ఇరవై బంతులు మిగిలి ఉండగానే ఎనిమిది వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది.

### తేలిపోయిన ఆతిథ్య బౌలర్లు..

సాధారణంగా చెపాక్ పిచ్‌పై చెన్నై స్పిన్నర్ల దే ఆధిపత్యం ఉంటుంది. కానీ ఈ మ్యాచ్ లో మాత్రం వారు తీవ్రంగా నిరాశపరిచారు. నూర్ అహ్మద్ తన నాలుగు ఓవర్లలో 29 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీయగా, అకీల్ హొసేన్ 3.4 ఓవర్లలో 46 పరుగులు ఇచ్చి ఒక వికెట్ దక్కించుకున్నాడు. శివమ్ దూబే ఒక ఓవర్ వేసి ఏడు పరుగులు ఇచ్చాడు. అద్భుతమైన బౌలింగ్ తో చెన్నై బ్యాటింగ్ లైనప్ ను దెబ్బతీసిన గుజరాత్ టైటాన్స్ పేసర్ కగిసో రబడకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది.




# దర్శకుడి తీరుతో నరకం చూశా..

## నటి ప్రగతి సంచలన వ్యాఖ్యలు

## 50 ఏళ్ల వయసులో పవర్ లిఫ్టింగ్‌లో పతకాల పంట..

## అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నటి

## రెమ్యూనరేషన్ ముఖ్యం కాదు.. పాత్ర నచ్చితేనే సినిమా చేస్తా!



క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వెండితెరపై తనదైన ముద్ర వేసిన నటి ప్రగతి, తాజాగా ఒక ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు చిత్ర పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. మహిళలు సంకల్పించుకుంటే ఏదైనా సాధించగలరని నిరూపిస్తూ, 50 ఏళ్ల వయసులో పవర్ లిఫ్టింగ్‌లో దేశం తరపున పతకాలు సాధించిన ఆమె, తన సినీ కెరీర్‌లోని ఒక చీకటి కోణాన్ని బయటపెట్టారు. కెరీర్ ప్రారంభంలో ఒక దర్శకుడు తనను తీవ్రంగా ఇబ్బంది పెట్టాడని, ఆ ప్రాజెక్టులో పనిచేసినన్ని రోజులు తనకు నరకంలా అనిపించిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. దర్శకుడి పేరు వెల్లడించనప్పటికీ, ఆ షూటింగ్ జరిగినన్ని రోజులు తనకు ఒక పీడకలలా మిగిలిపోయాయని ప్రగతి పేర్కొన్నారు. "ఆ సినిమా ఎప్పుడు పూర్తవుతుందా? ఎప్పుడు ఆ ప్రాజెక్ట్ నుంచి బయటపడదామా? అని ప్రతి నిమిషం ఎదురుచూశాను. భవిష్యత్తులో ఆ దర్శకుడితో మళ్లీ పని చేసే ప్రసక్తే లేదు" అని ఆమె స్పష్టం చేశారు. గతంలో ఇలాంటి విషయాలు చెప్పడానికి నటీమణులు భయపడేవారని, కానీ ఇప్పుడు ధైర్యంగా మాట్లాడే రోజులు వచ్చాయని ఆమె వ్యాఖ్యానించారు. దీంతో ప్రగతిని అంతగా వేధించిన ఆ దర్శకుడు ఎవరై ఉంటారా అని నెటిజన్లు ఆమె పాత సినిమాల జాబితాను జల్లెడ పడుతున్నారు.



### పవర్ లిఫ్టింగ్‌లో పతకాల జోరు

సినిమాలకు కొంతకాలం విరామం ఇచ్చి తన చిరకాల కోరికైన క్రీడారంగం వైపు ప్రగతి దృష్టి సారించారు. 50 ఏళ్ల వయసులో పవర్ లిఫ్టింగ్ చేయడం అసాధ్యమని భావించిన వారికి తన విజయాలతో సమాధానమిచ్చారు. ఈ క్రమంలో ఆమె దేశం కోసం పలు పతకాలను సాధించి గర్వకారణంగా నిలిచారు. పట్టుదల ఉంటే వయసు కేవలం అంకె మాత్రమేనని ఆమె నిరూపించారు. క్రీడల్లో రాణించిన తర్వాత ఇప్పుడు మళ్లీ వెండితెరపై తన సత్తా చాటేందుకు ఆమె సిద్ధమవుతున్నారు.

### నచ్చిన పాత్రే ప్రాధాన్యం

భవిష్యత్తులో చేయబోయే సినిమాల గురించి మాట్లాడుతూ.. రెమ్యూనరేషన్ కంటే పాత్రకే తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ప్రగతి క్లారిటీ ఇచ్చారు. "నాకు నచ్చని పాత్ర చేయమంటే ఎంత భారీ రెమ్యూనరేషన్ ఇచ్చినా చేయను. అదే పాత్ర నచ్చితే మాత్రం పారితోషికం గురించి కూడా ఆలోచించను" అని ఆమె తేల్చి చెప్పారు. ప్రస్తుతం ఒక మంచి కమ్ బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపిన ప్రగతిని, ప్రేక్షకులు కూడా త్వరలోనే వెండితెరపై ఒక పవర్‌ఫుల్ పాత్రలో చూడాలని ఆకాంక్షిస్తున్నారు.





# ప్రేమ, పెళ్లి పేరుతో అషు రెడ్డి మోసం

## నటి అషు రెడ్డిపై చీటింగ్ కేసు

## రూ. 9.35 కోట్లు మోసం చేసినట్లు ఫిర్యాదు!

## ప్రేమ, పెళ్లి పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌కు కుచ్చుటోపి..

హైదరాబాద్: ప్రముఖ సినీ నటి, బిగ్ బాస్ ఫేమ్ అషు రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ప్రేమ మరియు పెళ్లి పేరుతో ఒక యువకుడిని నమ్మించి సుమారు రూ. 9.35 కోట్ల మేర మోసం చేసిందన్న ఆరోపణలపై హైదరాబాద్ సిటీ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులు అషు రెడ్డి మరియు ఆమె కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న తన కుమారుడిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అషు రెడ్డి భారీ మొత్తంలో డబ్బు వసూలు చేసిందని బాధితుడి తండ్రి యనమల సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.

### ఏడేళ్లుగా సాగుతున్న మోసం?

బాధితుడి తండ్రి ఫిర్యాదు ప్రకారం.. అషు రెడ్డికి, లండన్‌లో ఉంటున్న ధర్మేంద్రకు 2018 నుంచి పరిచయం ఉంది. పెళ్లి చేసుకుంటానని నమ్మించిన ఆమె, అప్పటి నుండి వివిధ కారణాలు చెబుతూ పలుమార్లు ధర్మేంద్ర దగ్గర పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుంది. ఆ డబ్బుతో విలాసవంతమైన కారు, భారీగా బంగారం మరియు పలు స్థిరాస్తులను కొనుగోలు చేసిందని, వాటన్నింటినీ తన పేరుతోనే రిజిస్ట్రేషన్ చేయించుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మొత్తం రూ. 9.35 కోట్లతో పాటు, అషు రెడ్డి సోదరికి కూడా మరో రూ. 50 లక్షలు ఇచ్చినట్లు సత్యనారాయణ వెల్లడించారు. తీరా పెళ్లి ప్రస్తావన వచ్చేసరికి అషు రెడ్డి నిరాకరించడంతో, తాము మోసపోయామని గ్రహించిన బాధితుడి కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. ఈ భారీ మోసంలో అషు రెడ్డితో పాటు ఆమె కుటుంబ సభ్యుల ప్రమేయం కూడా ఉందని బాధితుడు ఆరోపించడంతో పోలీసులు అందరిపై కేసులు నమోదు చేశారు. ప్రధానంగా విదేశాల్లో ఉంటున్న యువకుడిని టార్గెట్ చేసి, పెళ్లి పేరుతో ఆస్తులు కూడబెట్టారనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. గతంలో డ్రగ్స్ కేసులోనూ ఈమె పేరు వినిపించడం, ఇప్పుడు ఏకంగా కోట్ల రూపాయల చీటింగ్ కేసు నమోదు కావడంతో టాలీవుడ్ వర్గాల్లో ఈ అంశం హాట్ టాపిక్‌గా మారింది. తనపై నమోదైన ఈ సంచలన ఆరోపణలపై అషు రెడ్డి ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.

# గ్లామర్ హద్దులు చెరిపేస్తున్న శనయా

యువ నటి శనయా కపూర్ తాజా ఫోటోషూట్‌తో మళ్లీ ఫ్యాషన్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. నలుపు లెదర్ కార్సెట్ టాప్, మెర్మెయిడ్ స్టైల్ స్కర్ట్‌లో ఆమె కనిపించిన తీరు సంప్రదాయ గ్లామర్‌కు భిన్నంగా, కొత్త ట్రెండ్‌ను సూచించినట్టుగా అనిపించింది. తెల్లని లేస్ డిటైల్స్ ఆమె లుక్‌కు సున్నితమైన అందాన్ని జోడించాయి. వెస్టర్న్ టచ్ ఉన్న బ్రెయిడెడ్ బెల్ట్‌పై మెరిసే సిల్వర్ బకిల్స్ ఆమె స్టైల్‌ను మరింత బోల్డ్‌గా మార్చాయి. తేలికగా వాలిన జుట్టు, స్మోకీ ఐ మేకప్, షార్ప్ హీల్స్ అన్నీ కలిసి ఆమెను ఓ మోడర్న్ ఫ్యాషన్ ఐకాన్‌లా చూపించాయి. బ్లాక్ అండ్ వైట్ ఫోటోల్లో ఆమె హావభావాలు మరింత గాఢంగా, ఆకర్షణీయంగా కనిపించాయి. ఇటీవల విడుదలైన 'ఆంఖోన్ కీ గుస్తాఖియాన్' ఆశించిన ఫలితం ఇవ్వకపోయినా, శనయా మాత్రం తన ప్రయాణాన్ని తగ్గించలేదు. స్టైల్, ఆత్మవిశ్వాసంతో ఇండస్ట్రీలో తనదైన గుర్తింపును మరింత బలంగా నిలబెట్టుకునే దిశగా ముందుకు సాగుతోంది.





# అందాలతో కృతి కూల్

వేసవి వేడి తీవ్రత పెరుగుతున్న వేళ అందరూ తేలిక దు-స్తులకే మొగ్గు చూపుతుంటే, యువ నటి కృతి శెట్టి మాత్రం సంప్రదాయ దుస్తుల్లోనే తన అందాన్ని మెరిసేలా చేసింది. పూర్తి సాటిన్ చీరలో ఆమె కనిపించిన తీరు ఎండ మధ్య కూడా ఒక చల్లని అనుభూతిని కలిగించినట్టుగా అనిపించింది. అధిక ఉష్ణోగ్రతల మధ్య కూడా ఆమె స్టైల్‌లో ఎలాంటి మార్పు కనిపించలేదు. మింట్‌గ్రీన్ సాటిన్ చీరపై యెల్లో టై-డై డిజైన్లు ఆమె లుక్‌కు ప్రత్యేక ఆకర్షణను తీసుకొచ్చాయి. ఫ్లోరల్ బ్లౌజ్, మెరిసే డైమండ్ ఇయరింగ్స్, సాఫ్ట్ వేవీ హెయిర్-అన్నీ కలిసి ఆమెను ఒక ఫ్రెష్ సమ్మర్ ఫీల్‌లా చూపించాయి. సాధారణంగా వేడి కాలంలో కనిపించని చల్లదనాన్ని ఆమె తన స్టైలింగ్‌తో అందించింది. బయట 45 డిగ్రీల ఎండలు మండుతున్నా, ఆ ప్రభావం ఎక్కడా కనిపించకుండా కృతి శెట్టి తన అందంతో ఆకట్టుకుంది. గ్లామర్‌తో పాటు సంప్రదాయానికి విలువనిస్తూ, ఎప్పటికీ ఫ్యాషన్‌లో నిలిచే స్టైల్ ఇదేనని మరోసారి నిరూపించింది.

Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com